జాతీయ తెలుగు దినపత్రిక

NIZAMABAD EDITION

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

నిజామాబాద్ శుక్రవారం 21 ఆగస్టు 2026 సంపుటి : 16 సంచిక : 200 పేజీలు : 8 వెల : 1/- RNI No. TELTEL/2010/35558

శ్రీ పరాభవ నామ సంవత్సరం ఆషాఢ మాసం గ్రీష్మ ఋతువు దక్షిణాయణం సూర్యోదయం: 5.42 । సూర్యాస్తమయం: 6.22 చంద్రోదయం: 4.57 । చంద్రాస్తమయం: 5.20 తిథి: బహుళ చతుర్దశి రా. 1.37 వరకు, తదుపరి అమావాస్య నక్షత్రం: పుష్యమి సా. 10.23 వరకు, తదుపరి ఆశ్లేష యోగం: సిద్ధి రా. 8.18 వరకు, తదుపరి వ్యతీపాత కరణం: భద్ర మ. 2.45 వరకు, తదుపరి శకుని రా. 1.37 వరకు, తదుపరి

Published from : NIZAMABAD, WARANGAL, RANGAREDDY, KAMMAM, NALAGONDA http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.

అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు

9440231967

# ఆగని విద్యార్థుల ఆందోళనలు

జీవో 97కు వ్యతిరేకంగా మిన్నంటిన నిరసనలు

పాలిటెక్నిక్ కళాశాలల బంద్ ప్రశాంతం



**కోటగిరి/మాక్లూర్/నవీపేట, ఆగస్టు 20**

యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ పేరిట ప్రభుత్వం తీసుకొచ్చిన శక్తి పాలసీకి వ్యతిరేకంగా విద్యార్థుల ఆందోళనలు గురువారం కూడా కొనసాగాయి. జీవో 97ను రద్దు చేయాలంటూ మాక్లూర్, కోటగిరి, నవీపేట తదితర ప్రాంతాల్లో నిరసనలు మిన్నంటాయి. తమ భవిష్యత్తును దెబ్బతీసేలా ఐటీఐలను పాలిటెక్నిక్ కళశాలల్లో విలీనం చేసేలా రేవంత్ సర్కార్ తీసుకొచ్చిన జీవో 97 రద్దు చేసేంత వరకూ ఉద్యమం ఆగదని విద్యార్థులు స్పష్టం చేశారు. నవీపేటలో పాలిటెక్నిక్ కళాశాలను బంద్ చేయించిన విద్యార్థులు.. అనంతరం ర్యాలీగా వెళ్లి అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. మాక్లూర్ మండలం దాస్‌నగర్‌లోని విజయ్ రూరల్ పాలిటెక్నిక్ కాలేజీ విద్యార్థులు ధర్నా నిర్వహించారు. కోటగిరిలోని పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు బంద్ పాటించి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మూడేండ్ల పాలిటెక్నిక్ ఇంజినీరింగ్ డిప్లామా స్థాయిని, సర్టిఫికెట్ స్థాయి ఉండే ఐటీఐలతో కలపడంతో డిప్లమా ప్రమాణాలు తగ్గిపోవడమే కాకుండా దాని మార్కెట్ విలువ కూడా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పాలిటెక్నిక్ విద్యావ్యవస్థను కార్పొరేట్ చేతుల్లోకి నెట్టేందుకు ఈ మార్పులు చేస్తున్నారని మండిపడ్డారు. విద్యార్థులతో కానీ, పాలిటెక్నిక్ కళాశాలల అధ్యాపకులతో కానీ, మేధావులు, విద్యార్థి సంఘాలతో కానీ చర్చించకుండా జీవో 97 విడుదల చేయడం పై మండిపడ్డారు. సదరు జీవోను తక్షణమే రద్దు చేసి, ఇప్పుడున్న పద్ధతిలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. లేకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం తప్పదని హెచ్చరించారు. పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ తదితర విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# కోటాలపల్లిలో ఇంకుడు గుంతల నిర్మాణానికి శ్రీకారం

వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించడమే లక్ష్యం

ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంత నిర్మించుకోవాలి .. సర్పంచ్ ఆకుల శ్యామ్‌కుమార్

**కామారెడ్డి టౌన్ ఆగస్టు 21 (ప్రజాజ్యోతి)**

కామారెడ్డి మండలం కోటాలపల్లి గ్రామంలో వర్షపు నీటిని సద్వినియోగం చేసుకోవడంతో పాటు భూగర్భ జలాలను పెంపొందించేందుకు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఇంకుడు గుంతల నిర్మాణానికి చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా గ్రామంలో ఇంకుడు గుంతలు నిర్మించాల్సిన ప్రదేశాలను గుర్తించి, ఆయా ప్రాంతాల్లో ముగ్గు వేసి మార్కౌట్ చేశారు. గ్రామంలో ప్రతి కుటుంబం ఇంకుడు గుంతలు నిర్మించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఆకుల శ్యామ్‌కుమార్ మాట్లాడుతూ.. వర్షపు నీటిని వృథాగా కాలువల్లోకి వెళ్లకుండా భూమిలోకి ఇంకేలా చేయడం ద్వారా భూగర్భ జలాలను పెంపొందించుకోవచ్చని తెలిపారు. ప్రతి ఇంటి వద్ద తప్పనిసరిగా - మిగతా2లో



# ఆరోగ్యంపై అవగాహన

గూడెంలో ఉచిత వైద్య శిబిరం

గ్రామ ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు

**కామారెడ్డి టౌన్ ఆగస్టు 21 (ప్రజాజ్యోతి)**

కామారెడ్డి మండలం గూడెం గ్రామంలో గ్రామ ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ఉచిత వైద్య శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరానికి గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై వైద్య సేవలను సద్వినియోగం చేసుకున్నారు. గ్రామంలోనే ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. వైద్య శిబిరానికి వచ్చిన గ్రామ ప్రజలను వైద్యులు పరీక్షించి వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. వివిధ ఆరోగ్య సమస్యలకు సంబంధించి వైద్యులను సంప్రదించిన ప్రజలకు అవసరమైన సూచనలు, సలహాలు అందించారు. ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై - మిగతా2లో



# రైతుల విజ్ఞప్తికి సర్కార్ స్పందన



నీటిని పొదుపుగా వాడండి.. రైతులకు పోచారం పిలుపు!

సిద్దాపూర్ రిజర్వాయర్‌కు రివైజ్డ్ శాంక్షన్.. రైతులకు మరో వరం!

12.284 టీఎంసీల నీరు.. ఖరీఫ్ సాగుకు పోచారం భరోసా!

ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావం.. అందుబాటులో ఉన్న నీటిని సమర్థంగా వాడుకోవాలని పిలుపు



సాగునీటి విడుదలకు నిర్ణయం!



**నిజాంసాగర్ ఆగస్టు 20 ప్రజా జ్యోతి**

రైతుల విజ్ఞప్తికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. ఖరీఫ్ పంటలను కాపాడేందుకు నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి అవసరమైన సాగునీటిని విడుదల చేయాలని నిర్ణయించినట్లు రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి తెలిపారు. గురువారం ఆయన నిజాంసాగర్ ప్రాజెక్టును సందర్శించి ప్రాజెక్టులోని నీటి నిల్వలు, నీటి లభ్యత, సాగునీటి అవసరాలపై అధికారులతో - మిగతా2లో

# యూరియా యాప్ వద్దు.. ఎకరానికి 4 బస్తాలు ముద్దు!







యూరియా కొరతపై రైతుల రాస్తారోకో.
కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేతల మండిపాటు.

**ఎడపల్లి, ఆగస్టు 20 (ప్రజాజ్యోతి):** యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, యూరియా పంపిణీకి తీసుకొచ్చిన యాప్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతులు గురువారం ఎడపల్లి మండలం సాటాపూర్ గేట్ వద్ద ప్రధాన రహదారిపై భారీ రాస్తారోకో నిర్వహించారు. యూరియా కోసం రైతులు రోజుల తరబడి పడిగాపులు కాస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని నాయకులు, రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి రైతుకు ఎకరానికి నాలుగు బస్తాల యూరియా అందించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ కొండెంగాల శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు రవీందర్ గౌడ్, ఆకుల శ్రీనివాస్ మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు ఎరువులు అందించడంలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపిందన్నారు. రైతులకు అవసరమైన సమయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎరువులు అందించిన ఘనత మాజీ సీఎం కేసీఆర్ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత యూరియా కోసం రైతులు రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని విమర్శించారు. యాప్ పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. వ్యవసాయ సీజన్‌లో రైతులకు అవసరమైన సమయంలో సరిపడా యూరియా అందించడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. వెంటనే యూరియా సరఫరాను పెంచి, ఎకరానికి నాలుగు బస్తాల చొప్పున అందించాలని డిమాండ్ చేశారు.

**రైతులకు అండగా బీఆర్ఎస్:**

రైతుల సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ నిరంతరం పోరాడుతుందని నాయకులు తెలిపారు. యూరియా కొరతను పరిష్కరించి, రైతులకు పూర్తిస్థాయిలో ఎరువులు అందించే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

**భారీగా నిలిచిన వాహనాలు:**

రాస్తారోకో కారణంగా సాటాపూర్ గేట్ ప్రధాన రహదారిపై వాహనాలు భారీగా నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న ఎడపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని రైతులు, బీఆర్ఎస్ నాయకులతో మాట్లాడారు. పరిస్థితిని అదుపులోకి తీసుకుని రహదారిపై నిలిచిపోయిన వాహనాలను క్రమబద్ధీకరించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. రాస్తారోకోలో బీఆర్ఎస్ మండల నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతుల విజ్ఞప్తికి సర్కార్ స్పందన..

-మొదటిపేజీ తరువాయి

వివరాలు తెలుసుకున్నారు.ప్రాజెక్టు డీఈ ప్రవీణ్‌ను ప్రస్తుత నీటి పరిస్థితిపై వివరాలు అడిగి తెలుసుకున్న పోచారం శ్రీనివాసరెడ్డి.. ప్రస్తుతం నిజాంసాగర్‌లో 1400.84 అడుగుల నీటిమట్టం ఉండగా 12.284 టీఎంసీల నీరు అందుబాటులో ఉందని అధికారులు తెలిపారు.ప్రాజెక్టులో ఉన్న నీటిని ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా వినియోగిస్తూ ఆయకట్టు రైతులకు సాగునీరు అందించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.అనంతరం ప్రాజెక్టు వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పోచారం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. నిజాంసాగర్ ఆయకట్టు పరిధిలో ఇప్పటికే పెద్ద సంఖ్యలో రైతులు వరి నాట్లు పూర్తి చేసుకున్నారని తెలిపారు.పంట కీలక దశలో ఉన్న సమయంలో సాగునీటి కొరత ఏర్పడకుండా రైతులకు అవసరమైన నీటిని విడుదల చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పంటలను కాపాడేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని భరోసా ఇచ్చారు.అయితే అందుబాటులో ఉన్న నీటిని రైతులు బాధ్యతగా వినియోగించుకోవాలని సూచించారు.ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశం ఉన్నందున సాగునీటిని వృథా చేయకుండా పొదుపుగా ఉపయోగించుకోవాలని కోరారు.అవసరానికి మించి నీటిని వినియోగించకుండా పంటకు సరిపడా నీటిని సమర్థవంతంగా అందిస్తే ఎక్కువ విస్తీర్ణంలో పంటలను కాపాడుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి ఖరీఫ్ సాగుకు నీటిని విడుదల చేయాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై పోచారం శ్రీనివాసరెడ్డి హర్షం వ్యక్తం చేశారు.రైతుల పంటలను దృష్టిలో ఉంచుకుని సాగునీటి విడుదలకు నిర్ణయం తీసుకున్న భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి బాన్సువాడ నియోజకవర్గ రైతుల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.రైతుల అవసరాలను



ప్రభుత్వం దృష్టిలో ఉంచుకుని నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు.ఇదే సమయంలో బాన్సువాడ నియోజకవర్గంలోని నాన్-కమాండింగ్ ప్రాంతాలకు సాగునీరు అందించేందుకు చేపడుతున్న సిద్దాపూర్ రిజర్వాయర్ అంశాన్ని కూడా ఆయన ప్రస్తావించారు.సిద్దాపూర్ రిజర్వాయర్ రివైజ్డ్ శాంక్షన్‌కు అంగీకారం తెలిపిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రైతుల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ రిజర్వాయర్ పూర్తయితే ప్రస్తుతం సాగునీటి సౌకర్యం లేని ప్రాంతాల్లోనూ వ్యవసాయానికి నీటి లభ్యత మెరుగుపడే అవకాశం ఉందన్నారు.నిజాంసాగర్ నీటిని రైతుల అవసరాలకు అనుగుణంగా వినియోగిస్తూ పంటలను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పోచారం పేర్కొన్నారు.ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఆయకట్టు రైతులకు సాగునీటి విషయంలో కొంత భరోసా కలిగిందని తెలిపారు.

# మల్లుపేట్ గ్రామంలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం





--రూ.40 లక్షల అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం
--మహిళా సమాఖ్య భవనం, సీసీ రోడ్డు, గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు

**సదాశివనగర్, ఆగస్టు 20 (ప్రజాజ్యోతి)** సదాశివనగర్ మండలం మల్లుపేట్ గ్రామంలో గ్రామాభివృద్ధికి మరో అడుగు పడింది. ఎల్లారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీ మదన్ మోహన్ రావు. గ్రామంలో 40 లక్షల వ్యయంతో నిర్మించిన పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా 10 లక్షల వ్యయంతో నిర్మించిన మహిళా సమాఖ్య భవనం,10 లక్షలతో నిర్మించిన నూతన సీసీ రోడ్డు అలాగే 20 లక్షలతో నిర్మించిన నూతన గ్రామపంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. మహిళా సంఘాల కార్యకలాపాలకు మహిళా సమాఖ్య భవనం మరింత ఉపయోగకరంగా మారనుండగా, నూతన గ్రామపంచాయతీ భవనం ద్వారా గ్రామ పరిపాలనా సేవలు ప్రజలకు మరింత సౌకర్యవంతంగా అందనున్నాయి. అలాగే సీసీ రోడ్డు నిర్మాణంతో గ్రామ ప్రజల రాకపోకలకు మెరుగైన సౌకర్యం కలగనుంది. గ్రామాల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని ఎమ్మెల్యే ఈ సందర్భంగా పేర్కొన్నారు. మల్లుపేట్ గ్రామంలో 40 లక్షల అభివృద్ధి పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం పట్ల గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఉప సర్పంచ్ పాలకవర్గ సభ్యులు కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సీనియర్ నాయకులు కార్యకర్తలు వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కనీస వేతనాలు అమలు చేయాలి టియుసిఐ కార్యదర్శి రమేష్ డిమాండ్






**ధర్పల్లి (ప్రజా జ్యోతి) ఆగస్టు 20** కార్మికుల గౌరవ ప్రద జీవనం కోసం కనీస వేతనాలను అమలు చేయాలని నిజామాబాదు రూరల్ కామారెడ్డి డివిజన్ టియుసిఐ కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు పార్టీ జాతీయ కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా ఎంపీడీవో కార్యాలయం ముందు కార్మికులతో కలిసి ప్రదర్శన నిర్వహించారు ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతు కార్మికులకు కనీస వేతనంగా 39,373 రూపాయలు చెల్లించాలని అన్నారు అలాగే గతంలో ఉన్న నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని ఆయన కోరారు తప్పుడు వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందని ఆయన ఆరోపించారు ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కార్మికుల న్యాయమైన కోరికలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు లేని పక్షంలో సమ్మెను ఉధృతం చేస్తామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ధర్పల్లి మండల అధ్యక్షులు ఆశన్న సిరికొండ మండల అధ్యక్షులు మండల నాయకులు సాయిలు విలాస్ జగన్ వర్షిత్ సర్బుద్దిన్ శారద సులోచన సాయవ్వ రాధ తదితర కార్మికులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల హక్కుల కోసం కృషి చేస్తాం నూతన కార్యవర్గం.



**ముప్కాల్, ప్రజాజ్యోతి, ఆగస్టు 20** ముప్కాల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పిఆర్‌టియు టిఎస్ మండల సర్వసభ్య సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశంలో ముప్కాల్ మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పిఆర్‌టియు టిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కిషన్ తెలిపారు.నూతన అధ్యక్షులు కొత్తపల్లి శ్రీనివాస్ ప్రధాన కార్యదర్శి కొంగ్రు నవీన్ కార్యవర్గ సభ్యులు జి. రవి, ఇందిర, రామకృష్ణ, స్వరూప, రాజేశ్వర్, కవిత ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొత్తపల్లి శ్రీనివాస్, కొంగ్రు నవీన్ మాట్లాడుతూ ముప్కాల్ మండలంలోని ఉపాధ్యాయుల హక్కుల సాధనకు, వారి సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఉపాధ్యాయులకు ఎలాంటి సమస్య రాకుండా బాధ్యతాయుతంగా పనిచేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి గంగారాం, జిల్లా మాజీ అధ్యక్షులు తుమ్మల లక్ష్మణ్ పటేల్, మాజీ ప్రధాన కార్యదర్శి పెంట జలంధర్, వెంకటేష్ గౌడ్, జిల్లా బాధ్యులు గంట అశోక్, రాష్ట్ర బాధ్యులు గుండోజీ నరేందర్, తాడూరి లక్ష్మణ్, శ్రీనివాస్, వన్నెల్దాస్ నరేష్, తెడ్డు చిన్నయ్యలతో పాటు వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, ప్రాథమిక సభ్యులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నా.

# యువతే దేశ భవిష్యత్తు.. రాజీవ్ గాంధీ ఆశయాలు స్ఫూర్తిదాయకం







**నిజాంసాగర్ ఆగస్టు 20 ప్రజా జ్యోతి** నిజాంసాగర్ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం భారతరత్న, మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ప్రజా పండరి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నాయకులు, కార్యకర్తలు ఘనంగా నివాళు లర్పించారు.యువతే దేశ భవిష్యత్తు అని విశ్వసించి, భారతదేశాన్ని ఆధునిక సాంకేతిక యుగం వైపు నడిపించిన దూరదృష్టి గల నాయకుడు రాజీవ్ గాంధీ అని నాయకులు కొనియాడారు.దేశ ప్రగతి కోసం ఆయన చేసిన సేవలు, ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.అనంతరం సద్భావన దివస్ ప్రతిజ్ఞ చేసి కుల, మత, ప్రాంత, భాష భేదాలకు అతీతంగా జాతీయ ఐక్యత, సామరస్యం కోసం కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.అనంతరం నిజాంసాగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేసి, వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.రాజీవ్ గాంధీ ఆశయాలను కొనసాగిస్తూ ప్రజాసేవకు అంకితం కావడమే ఆయనకు నిజమైన నివాళి అని నాయకులు అన్నారు.కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యువజన కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ అభివృద్ధికై - హస్తం గూటికి





--పద్మాజివాడి గ్రామ పాలకవర్గం

--ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు కు ఘన స్వాగతం పలికిన పాలకవర్గం

--10 లక్షలతో మహిళా సంఘం భవనానికి భూమిపూజ

**సదాశివనగర్, ఆగస్టు 20 (ప్రజాజ్యోతి)** సదాశివనగర్ మండలం పద్మాజివాడి గ్రామం అభివృద్ధి, ప్రజా సంక్షేమం లక్ష్యంగా పద్మాజివాడి గ్రామ పాలకవర్గం ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యే మదన్ మోహన్ రావుకు గ్రామ సర్పంచ్, పాలకవర్గం సభ్యులు గ్రామస్తులు ఘన స్వాగతం పలికి ఆత్మీయంగా ఆహ్వానించారు. పద్మాజివాడి సర్పంచ్ సుబ్బారావు, ఉపసర్పంచ్ రాజశేఖర్, వార్డు సభ్యులు శ్రావణ్ రెడ్డి, రాజేందర్, శివరాజు, సంతోష్, చందు, ప్రశాంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే విరికి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా గ్రామ పాలకవర్గ సభ్యులు మాట్లాడుతూ, ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు. వచ్చిన తర్వాతే ఎల్లారెడ్డి నియోజకవర్గంలో అభివృద్ధి వేగం పెరిగిందని కొనియాడారు. పేద ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వారి ఇంటి ముంగిటకు చేరేలా ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు, సన్నబియ్యం, ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం, మహిళా సంఘాలకు సమాఖ్య భవనాలు, నూతన రోడ్ల నిర్మాణం వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారని పేర్కొన్నారు. తాగునీటి సమస్య ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక చొరవతో బోర్లు ఏర్పాటు చేయిస్తూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా పద్మాజివాడి గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారం, నీటి పైప్‌లైన్ ఏర్పాటు కోసం 10 లక్షల ఎస్‌డీఎఫ్ నిధుల మంజూరు పత్రాన్ని ఎమ్మెల్యే ప్రజాప్రతినిధులకు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మదన్ మోహన్ మాట్లాడుతూ, ప్రతి పేదవాడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. గుడిసెలు లేని ఎల్లారెడ్డి నియోజకవర్గాన్ని చూడటమే తన లక్ష్యమని అందుకే అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తున్నామని తెలిపారు. రెండో విడతలో కూడా 2,000కు పైగా ఇందిరమ్మ ఇండ్లను పేద కుటుంబాలకు అందించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. అనంతరం గ్రామంలో 10 లక్షల వ్యయంతో నిర్మించనున్న మహిళా సంఘం సమాఖ్య భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో సదాశివనగర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నల్ల మైపాల్ రెడ్డి. సి డి సి చైర్మన్ ఇర్షదుద్దిన్. గ్రామ సీనియర్ నాయకులు మండల నాయకులు ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, మహిళలు మరియు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఏసీబీకి వలకు చిక్కిన రాజంపేట ఎస్ఐ





**కామారెడ్డి టౌన్ ఆగస్టు 20, ప్రజా జ్యోతి** రాజంపేట పోలీస్‌స్టేషన్‌లో సబ్‌ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న దువ్వల ఆంజనేయులు రూ.30 వేల లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. గురువారం (20-08-2026) ఈ ఘటన చోటుచేసుకుంది. ఏసీబీ వివరాల ప్రకారం.. ఫిర్యాదుదారుడి కుమారుడికి స్టేషన్ బెయిల్ ఇవ్వడంతో పాటు కేసులో చార్జిషీట్ దాఖలు చేసే సమయంలో తదుపరి సహాయం అందించేందుకు రూ.30 వేల లంచాన్ని ఎస్ఐ డిమాండ్ చేశారు. అనంతరం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఎన్జీవోఎస్ కాలనీ లో గల తన నివాసంలో ఆ మొత్తాన్ని స్వీకరిస్తుండగా ఏసీబీ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. ఎస్ఐ సూచన మేరకు ఆయన వద్ద ఉన్న రూ.30 వేల లంచం సొమ్మును స్వాధీనం చేసుకున్నారు. అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి ఎస్ఐని అరెస్టు చేసినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. అనంతరం హైదరాబాద్ నాంపల్లిలోని ఎస్పీ, ఏసీబీ కేసుల విచారణకు నియమితులైన రెండో అదనపు ప్రత్యేక న్యాయమూర్తి ఎదుట హాజరుపరచనున్నట్లు వెల్లడించారు. కేసు దర్యాప్తు కొనసాగుతోంది. ప్రభుత్వ అధికారి ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064కు సమాచారం ఇవ్వాలని అధికారులు ప్రజలకు సూచించారు. ఫిర్యాదుదారుల వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

## కోటాలపల్లిలో ఇంకుడు గుంతల నిర్మాణానికి శ్రీకారం

-మొదటిపేజీ తరువాయి

ఇంకుడు గుంతను నిర్మించుకోవాలని గ్రామ ప్రజలకు సూచించారు. భవిష్యత్ తరాలకు నీటి కొరత లేకుండా చూడాలంటే ఇప్పటి నుంచే వర్షపు నీటిని సంరక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వర్షాకాలంలో కురిసే ప్రతి చుక్క నీటిని ఒడిసిపట్టేలా ఇంకుడు గుంతల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. గ్రామంలోని ఇళ్ల వద్ద, ప్రభుత్వ భవనాలు, ఇతర అనువైన ప్రాంతాల్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయడం ద్వారా వర్షపు నీటిని భూమిలోకి పంపించవచ్చన్నారు. దీనివల్ల భూగర్భ జలమట్టం పెరగడంతో పాటు బోర్లు, బావుల్లో నీటి లభ్యత మెరుగుపడే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

### నీటి సంరక్షణపై ప్రజలకు అవగాహన

గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో చేపడుతున్న ఇంకుడు గుంతల నిర్మాణ కార్యక్రమం ద్వారా ప్రజల్లో నీటి సంరక్షణపై మరింత అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇంటి పరిసరాల్లో వర్షపు నీరు నిలిచిపోకుండా తగిన ఏర్పాట్లు చేసుకోవడంతో పాటు, వర్షపు నీటిని ఇంకుడు గుంతల ద్వారా భూమిలోకి పంపించాలని అధికారులు, గ్రామ పంచాయతీ ప్రతినిధులు సూచించారు. ప్రస్తుతం భూగర్భ జలాలపై ఆధారపడే పరిస్థితి పెరుగుతున్న నేపథ్యంలో వర్షపు నీటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని వారు తెలిపారు. గ్రామ ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ ఇళ్ల వద్ద ఇంకుడు గుంతలను నిర్మించుకోవాలని, గ్రామ పంచాయతీ చేపడుతున్న కార్యక్రమానికి సహకరించాలని కోరారు.

### గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం

గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని సర్పంచ్ ఆకుల శ్యామ్‌కుమార్ తెలిపారు. గ్రామంలో పారిశుద్ధ్యం, పచ్చదనం, నీటి సంరక్షణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని చెప్పారు. ఇంకుడు గుంతల నిర్మాణం పూర్తయిన తర్వాత వాటి నిర్వహణపై కూడా ప్రజలకు అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. ప్రతి కుటుంబం తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు వర్షపు నీటిని సంరక్షించే విధానాలను పాటించాలని సూచించారు. గ్రామంలో ఇంకుడు గుంతలకు ముగ్గు వేసి మార్కౌట్ చేసే కార్యక్రమాన్ని గ్రామ పంచాయతీ సిబ్బంది, పాలకవర్గ సభ్యులు, గ్రామ ప్రజల సహకారంతో నిర్వహించారు. గ్రామంలో మరిన్ని ఇంకుడు గుంతలను నిర్మించి వర్షపు నీటిని భూగర్భంలోకి చేర్చేలా చర్యలు కొనసాగనున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్, గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామ పంచాయతీ సెక్రటరీ దేవలక్ష్మి, టీఏ, గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## కామారెడ్డి నియోజకవర్గంలో తెలంగాణ రక్షణ సేనకు బలోపేతం

సీనియర్ న్యాయవాది దేవేందర్ గౌడ్ పార్టీలో చేరిక



**కామారెడ్డి టౌన్, ఆగస్టు 20 (ప్రజాజ్యోతి)** కామారెడ్డి నియోజకవర్గంలో తెలంగాణ రక్షణ సేనకు మరింత బలం చేకూరింది. దొమకొండ మండల కేంద్రానికి చెందిన సీనియర్ న్యాయవాది దేవేందర్ గౌడ్ తెలంగాణ రక్షణ సేనలో చేరారు. హైదరాబాద్‌లోని తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర కార్యాలయంలో గురువారం పార్టీ అధినేత్రి కవితమ్మ సమక్షంలో, కామారెడ్డి నియోజకవర్గ ఇంచార్జి రవీందర్ గుప్త ఆధ్వర్యంలో దేవేందర్ గౌడ్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా దేవేందర్ గౌడ్‌కు పార్టీ అధినేత్రి కవితమ్మ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కామారెడ్డి నియోజకవర్గంలో తెలంగాణ రక్షణ సేనను గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ప్రజా సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలపై స్పందించాలని, తెలంగాణ రక్షణ సేన ఆశయాలు, సిద్ధాంతాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కవితమ్మ పిలుపునిచ్చారు. ముఖ్యంగా నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో పార్టీ కార్యకలాపాలను విస్తరించి, ప్రజలతో మమేకమై పనిచేయాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. దేవేందర్ గౌడ్ వంటి సీనియర్ వ్యక్తులు పార్టీలో చేరడం ద్వారా కామారెడ్డి నియోజకవర్గంలో తెలంగాణ రక్షణ సేనకు మరింత బలం చేకూరుతుందని పార్టీ నాయకులు పేర్కొన్నారు. రానున్న రోజుల్లో నియోజకవర్గంలోని వివిధ మండలాలు, గ్రామాల్లో పార్టీని మరింత విస్తరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ పార్లమెంట్ ఇంచార్జి వేణు మాధవ్, రాష్ట్ర నాయకులు సురేష్ గౌడ్, కామారెడ్డి నియోజకవర్గ ఇంచార్జి రవీందర్ గుప్త తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తిమ్మకపల్లిలో గడ్డి మందు పిచికారీ



**కామారెడ్డి టౌన్, ఆగస్టు 21 (ప్రజాజ్యోతి)** కామారెడ్డి మండలం తిమ్మకపల్లి గ్రామంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో గడ్డి మందు పిచికారీ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని పలు ప్రాంతాల్లో పెరిగిన పిచ్చి మొక్కలు, గడ్డిని తొలగించేందుకు గడ్డి మందును పిచికారీ చేయించారు. గ్రామ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పారిశుద్ధ్య చర్యలు చేపట్టడంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు తెలిపారు. గ్రామంలోని ప్రధాన వీధులు, పరిసర ప్రాంతాల్లో గడ్డి, పిచ్చి మొక్కలు పెరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమం గ్రామ సర్పంచ్ గుర్రపు లక్ష్మి ఉప సర్పంచ్ గొర్రె పరమేశ్వర్ ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు. గ్రామాన్ని పరిశుభ్రంగా, పచ్చదనంతో ఉంచేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఈ సందర్భంగా నాయకులు కోరారు.

## ఎల్లారెడ్డి గ్రంథాలయానికి పోటీ పరీక్షలకు పుస్తకాల విరాళం



**ఎల్లారెడ్డి, ఆగస్టు -20(ప్రజా జ్యోతి )** జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, కార్యదర్శి వంశీకృష్ణ ఎల్లారెడ్డి గ్రంథాలయానికి రూ.నాలుగు వేల విలువైన పోటీ పరీక్షల పుస్తకాలను విరాళంగా అందజేయడం జరిగిందని గ్రంథాలయ సిబ్బంది తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాలు మరియు వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న స్థానిక నిరుద్యోగ యువతకు, విద్యార్థులకు ఈ పుస్తకాలు ఎంతో మేలు చేస్తాయని లైబ్రేరియన్ తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఖరీదైన పుస్తకాలు కొనుక్కోలేని పేద విద్యార్థులకు ఇది ఒక పెద్ద వరం అని పాఠకులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎల్లారెడ్డి గ్రంథాలయ పాఠకులు లైబ్రేరియన్ చైర్మన్ కు కృతజ్ఞతలు తెలియజేశారు. యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని చైర్మన్ చూపిన చొరవ, గ్రంథాలయ అభివృద్ధికి అందిస్తున్న సహకారం అభినందనీయమని కొనియాడారు. భవిష్యత్తులోనూ గ్రంథాలయానికి ఇదే రీతిలో ప్రోత్సాహం కొనసాగాలని పాఠకులు ఆకాంక్షించారు.

## రైతు శిక్షణ శిబిరం విజయవంతం

--ఆత్మ ఆధ్వర్యంలో పూర్వ అభ్యసన గుర్తింపు



**సదాశివనగర్, ఆగస్టు 20 (ప్రజాజ్యోతి)** సదాశివనగర్ మండలంలోని లింగంపల్లి గ్రామంలో ఆత్మ ఆధ్వర్యంలో పూర్వ అభ్యసన గుర్తింపు రైతు శిక్షణ శిబిరం కార్యక్రమం నిర్వహించబడింది అని మండల వ్యవసాయ శాఖ అధికారి ప్రజాపతి. తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారి ప్రజాపతి మాట్లాడుతూ. రైతుల శిక్షణ శిబిరం కార్యక్రమం ప్రారంభంలో రైతులకు సహజ వ్యవసాయంపై ఇప్పటికే ఉన్న పరిజ్ఞానం మరియు అవగాహనను అంచనా వేయడానికి ప్రాథమిక మూల్యాంకనం నిర్వహించబడింది. అనంతరం శాస్త్రవేత్త ప్రాంతీయ చెరకు మరియు వరి పరిశోధనా కేంద్రం, రుద్రూర్ ఏ. కృష్ణ చైతన్య. రైతులకు సహజ వ్యవసాయంపై శిక్షణ అందించారు. ఈ శిక్షణలో సహజ వ్యవసాయం యొక్క ప్రాముఖ్యత, సూత్రాలు, వివిధ సహజ వ్యవసాయ ద్రావణాల తయారీ విధానం, వాటి సరైన వినియోగం మరియు పొలంలో అన్వయించే విధానం గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, పాలకవర్గ సభ్యులు గ్రామ రైతులు మరియు వ్యవసాయ శాఖ ఏఈవోలు సులోచన, ప్రణీత, సురేందర్ పాల్గొన్నారు. రైతులు మరియు స్థానిక ప్రజాప్రతినిధులు చురుకుగా పాల్గొనడంతో ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది.

## జిజ్ఞాస పోటీల్లో డిగ్రీ విద్యార్థులు ప్రతిభ





**ఎల్లారెడ్డి, ఆగస్టు -20(ప్రజా జ్యోతి)** కళాశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించిన జిజ్ఞాస రాష్ట్రస్థాయి పోటీల్లో ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారాని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మినారాయణ అన్నారు. కళాశాల రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో బీఏ విద్యార్థులు భారతదేశంలో మీడియా, రాజకీయాలు అనే అంశంపై సమర్పించిన పరిశోధన ప్రజెంటేషన్ అందరినీ ఆకట్టుకుంది. ఈ ప్రాజెక్టును ఎం. మౌనిక, ఎం. సౌందర్య, కె. నిఖిత, ఎం. గౌతమి, ఆర్. మురళీమోహన్ లకు పొలిటికల్ సైన్స్ అధ్యాపకుడు సిహెచ్. లక్ష్మణ్, సంగీత వీరికి మార్గదర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన అభినందన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇ. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, ఎల్లారెడ్డి డిగ్రీ కళాశాల విద్యార్థులు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, దేశ రాజకీయాలకు సంబంధించిన అంశాన్ని తీసుకొని రాష్ట్ర రాజధానిలో చక్కటి ప్రెజెంటేషన్ ఇవ్వడం అభినందనీయం అని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. చంద్రకాంత్, ఐక్యూఏసీ సమన్వయకర్త డాక్టర్ వి. శంకరయ్య, అధ్యాపకులు సిహెచ్. లక్ష్మణ్, ఎం. సంగీత, బి. సంతోష్, కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఖాళీ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలి

**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలి**

**కలెక్టరేట్ ఎదుట సీపీఎం ధర్నా -- ఏవోకు వినతిపత్రం అందజేత**

**కామారెడ్డి టౌన్, ఆగస్టు 20 (ప్రజాజ్యోతి)** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేసి నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని, ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని కోరుతూ సీపీఎం రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు గురువారం కామారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఏవోకు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కోట్లాది మంది యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఖాళీ పోస్టులను భర్తీ చేయడంలో నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. ఎన్నికల సమయంలో సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి



వచ్చి 12 సంవత్సరాలు గడిచినా ఆ హామీని అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు.ల దేశంలోని యువత ఎదుర్కొంటున్న నిరుద్యోగ సమస్యను పరిష్కరించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. యువతను విభజించే రాజకీయాలకు స్వస్తి పలికి, దేశంలోని కోట్లాది మంది నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను గుర్తించి పారదర్శకంగా నియామక ప్రక్రియ చేపట్టాలని కోరారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం కూడా ఎన్నికల సమయంలో నిరుద్యోగ యువతకు రెండు లక్షల ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చిందని చంద్రశేఖర్ గుర్తు చేశారు. అయితే ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగ నియామకాలు చేపట్టడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేసి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ అవకాశాలు లేకపోవడం వల్ల నిరుద్యోగ యువత తీవ్ర నిరాశకు గురయ్యే పరిస్థితి ఏర్పడుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దీర్ఘకాలంగా ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువత సమస్యలను ప్రభుత్వాలు సీరియస్‌గా తీసుకుని తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. నిరుద్యోగ సమస్యను పరిష్కరించకపోతే యువతలో ఆందోళనలు మరింత ఉధృతమయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రభుత్వాలు ప్రజల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైతే ప్రజా ఉద్యమాలు మరింత బలపడతాయని చంద్రశేఖర్ పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికైనా నిరుద్యోగ యువత సమస్యలపై దృష్టి సారించి ఖాళీ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు దొడ్లే మోహన్‌తో పాటు పార్టీ నాయకులు, యువకులు, నిరుద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో సగం ఓట్లు పెండింగ్..

# నాలుగో వంతు మాయం

**హైదరాబాద్ :** తెలంగాణలో ఎన్నికల సంఘం ప్రత్యేక ఓటరు సవరణ అంటే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఎస్ఐఆర్ ఓ షాకింగ్ విషయాన్ని బయటపెట్టింది. ఎస్ఐఆర్ ముసాయిదా ప్రకటనలో ఏకంగా తెలంగాణలో ఇప్పటికే 73లక్షల ఓట్లను లో పెట్టారు. అంటే ఇప్పటికి వీటిని శాశ్వతంగా తొలగించినట్లే. ఈ జాబితాలో జూన్ నాటికి ఉన్న మొత్తం 3కోట్ల 38లక్షల 26వేల ఓటర్లలో 73లక్షల మందిని పర్మనెంట్‌గా తీసేశారంటే.. పోయిన ఓట్లు ఏకంగా 22శాతం. ఇక మిగిలింది.. 2కోట్ల 65లక్షలు మాత్రమే. మరో 93లక్షల ఓట్లను ఇంకా పెండింగ్‌లోనే ఉంచారు. ఇవన్నీ కూడా 2002 ఓటర్ జాబితాతో మ్యాపింగ్ కానివి.. లేదా ఇతర అనామలీస్ అంటే వాళ్లు చెప్పిన వాటికి అక్కడున్న వివరాలకు తేడాలు ఉన్నవి. అంటే డిజిటైజేషన్ అయిపోయిన ఓట్లలో ఇది 35శాతం. జూన్ 2026 నాటికి తెలంగాణలో మొత్తం ఓట్ల సంఖ్య 3,38, 26,244. ఓటర్ల జాబితాలో చాలా అవకతవకలున్నాయి. డూప్లికేట్ ఓటర్లున్నారు. కొంతమంది ఓట్లు మూడు నాలుగు చోట్ల కూడా ఉందనడానికి అనేక ఉదాహరణలున్నాయి. అంతే కాకుండా బయట నుంచి వచ్చిన అక్రమ వలసదారుల ఓట్లను కూడా తొలగించాలన్న ఉద్దేశ్యంతోనే ఎస్ఐఆర్ నిర్వహించారు. అందుకే ఇందులో చాలా పకడ్బందీ నిబంధనలున్నాయి. 1987 కంటే ముందు పుట్టిన వాళ్లు వాళ్ల జన్మ ధృవీకరణ పత్రం..1987-2004 వరకూ పుట్టినవాళ్లకు వాళ్ల తల్లిదండ్రుల జన్మధృవీకరణ, ఆ తర్వాత జన్మించిన జెన్‌జీలకు వాళ్ల పేరెంట్స్‌తో పాటు..ఓటర్ల జన్మధృవీకరణ తప్పనిసరి చేశారు. అలాగే ఓటు నమోదు చేసుకుంటున్న చోట అక్కడ నివాసానికి సంబంధించిన డాక్యుమెంట్లను పక్కాగా అడిగారు. అవన్నీ అడిగిన తర్వాత చాలా ఓట్లు పోతాయి అనుకున్నారు కానీ.. ఏకంగా 73లక్షల ఓట్లు మాయం అయ్యాయి. ఇది 22శాతం. ఇక్కడితోనే ఆగలేదు.. తెలంగాణలో డిజిటైజేషన్ పూర్తియన ఓట్ల జాబితాలో 2,64,87,213 ఓట్లు ఉన్నాయి. ఇప్పుడు ఇవన్నీ కూడా పర్‌ఫెక్ట్ అని చెప్పడం లేదు ఈసీ. ఎందుకంటే ఇందులో కూడా 92,87,577 ఓట్లను విత్‌హెల్డ్‌లో ఉంచింది. అంటే వీళ్ల వాలిడేషన్ పూర్తికాలేదు. దాదాపు 93లక్షల ఓట్లకు సంబంధించి మ్యాపింగ్‌లో వేరియేషన్స్, అలాగే వీళ్లు సమర్పించిన పత్రాల్లో ఎస్ఐఆర్ 2002కు సరిపోకపోవడం వంటి కారణాలున్నాయి. డిజిటైజేషన్ పూర్తి అయిన దాంట్లో 35శాతం. ఇందులో ఎంత వరకూ పరిష్కరించి ఓకే చేస్తారో తెలీదు కానీ.. పూర్తిగా తొలగించిన ఓట్లు, సమస్యలు ఉన్న ఓట్లు మొత్తం కలిపి 1,66,26,812. అంటే జూన్ వరకూ ఉన్న మొత్తం సగం. ( 49శాతం)జాబితాలో శాశ్వతంగా




లేకుండా పోయిన మొత్తం ఓట్లలో 43లక్షలు కోర్ అర్బన్ రీజియన్ అజఖీఇ పరిధిలో ఉన్నాయి. అంటే హైదరాబాద్ సహా మూడు జిల్లాలతో కూడా ప్రాతం. రంగారెడ్డి, మేడ్చల్, హైదరాబాద్ కలిపి 43లక్షల ఓట్లు ఇక్కడే పోయాయి. అంతే కాదు.. అభ్యంతరాలు, మ్యాపింగ్ సరిగ్గా అవ్వని ఓట్లు కూడా ఈ మూడు జిల్లాల్లో 39లక్షలు ఉన్నాయి. అంటే తెలంగాణలో పూర్తిగా పోయిన.. పూర్తిగా ఆమోదయోగ్యం కానీ.. కోటీ 60లక్షల ఓట్లలో 83లక్షలు కేవలం మూడు జిల్లాల పరిధిలో ఉన్నాయి.

**కారణాలు ఇవేనా..?**

ఈ స్థాయిలో కోర్ అర్బన్ ప్రాంతంలో ఓట్ల జాబితాలో సమస్యలు ఉండటానికి చాలా కారణాలు కనిపిస్తున్నాయి.

హైదరాబాద్ మెట్రో సిటీ అవ్వడం వల్ల తెలంగాణతో సహా ఇతర రాష్ట్రాల నుంచి ఇక్కడకు వచ్చిన వారు... పెద్ద సంఖ్యలో ఉన్నారు. వీరిలో చాలా మంది ఎస్ఐఆర్ ప్రక్రియ వల్ల తమ ఓట్లను తమ ప్రాంతంలోనే రిజిస్టర్ చేసుకోవాలనుకుంటున్నారు.

ఆంధ్ర ప్రాంతంలో ఉన్నవారికి ఎక్కువ మందికి తెలంగాణ, ఆంధ్ర రెండు చోట్ల ఓట్లు ఉన్నాయి. ఇప్పుడు ఎక్కడైనా ఒక్క ఓటే ఉండే అవకాశం ఉండటంతో వీళ్లలో ఎక్కువ మంది తమ మూలాలు ఉన్న ప్రాంతంలో ఓట్లను ఎంపిక చేసున్నారు.

తెలంగాణలో ఇతర జిల్లాల నుంచి హైదరాబాద్‌కు ఉపాధి కోసం వచ్చిన వాళ్లు కూడా తమ సొంత జిల్లాలో ఓట్లను కాపాడుకునేదుకు హైదరాబాద్‌లో ఓటును వదిలేశారు.

ఇక హైదరాబాద్ పాతబస్తీ ప్రాంతంలో చాలా మందికి సరైన పత్రాలు లేవు. అందుకే ఓటరు జాబితా రివిజన్‌లో ఎక్కువ మంది తిరిగి పత్రాలు ఇవ్వలేదు.

రాష్ట్రవ్యాప్తంగా 73లక్షల ఓట్లు తొలగిస్తే.. అందులో 19లక్షలు ఒక్క హైదరబాద్ జిల్లాలో ( గ్రేటర్ హైదరాబాద్ కాదు..) ఉన్నాయి. పాతబస్తీ కవర్ అయ్యే హైదరాబాద్‌లో 47లక్షలకు పైగా ఓటర్లున్నారు. అందులో దాదాపు 40శాతం అంటే 19లక్షల మంది తిరిగి రిజిస్టర్ చేసుకోలేదు.

అలాగే ఇప్పుడు జాబితాలో ఉన్న ఓటర్లలో కూడా సమస్యలున్నాయి. వీళ్లంతా కూడా సర్‌లో పత్రాలు సమర్పించలేకపోయారు. పాతబస్తీ ప్రాంతం మొత్తం కవర్ అయ్యే హైదరాబాద్ జిల్లాలో 6,70వేల మందికి అనామలీస్ ఉంటే.. మరో 6లక్షలమందికి మ్యాపింగ్ లేదు.

ఇంకో ముఖ్యమైన విషయం ఏంటంటే.. ఈ ఎస్ఐఆర్ ప్రక్రియ జరుగుతున్నప్పుడే.. కొత్త ఓటర్లు కూడా నమోదు చేసుకున్నారు. వాళ్ల సంఖ్య చేర్చిన తర్వాత కూడా నాలుగో వంతు ఓట్లు పో?యాయి.

## పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం

## పరిశీలించిన జనసేన తెర్నేకల్ వెంకప్ప

**దేవనకొండ :** ఆలూరు నియోజకవర్గంలోని పాఠశాలల్లో విద్యార్థులకు అందుతున్న మధ్యాహ్న భోజన వసతులు, బియ్యం నాణ్యతను జనసేన పార్టీ ఆలూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ తెర్నేకల్ వెంకప్ప పరిశీలించారు.గత వారం తెర్నేకల్ జెడ్పీ హైస్కూల్ ను, నిన్న దేవనకొండ జెడ్పీ హైస్కూల్‌ను సందర్శించి మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు.ఈ సందర్భంగా ఇటీవల సరఫరా అవుతున్న బియ్యం నాణ్యత గతంతో పోలిస్తే ఆశించిన స్థాయిలో లేదనే విషయం తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ఇది ఒక్క తెర్నేకల్ పాఠశాలకు మాత్రమే పరిమితమైన సమస్య కాదని, ఇతర పాఠశాలల్లో కూడా బియ్యం సరఫరా నాణ్యతను పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు.బియ్యం గోదాం నుంచి పాఠశాలలకు చేరే వరకు సరఫరా వ్యవస్థలోని ప్రతి దశలో నాణ్యతను అధికారులు తనిఖీ చేసి, సమస్యకు మూల కారణాన్ని గుర్తించాలని జిల్లా కలెక్టర్ ని కోరారు.విద్యార్థుల ఆరోగ్యం, వారికి అందుతున్న ఆహారం విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని తెర్నేకల్ వెంకప్ప స్పష్టం చేశారు .ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు అరవింద్, నందు, చంటి,వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

## భూగర్భ జలాలు ఎండిపోతున్నాయి

## ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

సి. బెళగల్ కోడుమూరు నియోజకవర్గంలో భూగర్భ జలాలు ఎండిపోతున్నాయని త్రాగునీటికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు..ప్రజలు తాగునీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారని కోడుమూరు శాసనసభ్యులు బొగ్గుల దస్తగిరి అన్నారు.శాసనసభసమావేశాల్లో భాగంగా ఆయన నియోజకవర్గంలోని నీటి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు.భూగర్భ జలాలు తగ్గిపోవడం వల్ల ప్రజలకు తాగు నీరు లభించక ఇబ్బందులు పడుతున్నారని,అలాగే వేసిన పంటలను కూడా రైతులు తొలగించాల్సి వస్తోందని, అసెంబ్లీలో సభ స్పీకర్ దృష్టికి తెచ్చారు.

## నిల్వ కోసం ఫారం పాండ్...

**పాల్వంచ :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలంలోని నాగారంకాలనీ , తొగ్గూడం గ్రామపంచాయతీ పరిధిలోనీ రైతు బానోత్ బద్రు పొలంలో 20x 20 మీటర్ల విస్తీర్ణంలో, 3 మీటర్ల లోతుతో ఫారం పాండ్ నిర్మాణాన్ని గురువారం ఎంపీడీవో ప్రారం భించారు.ఈ సందర్భంగా ఎంపీడీవో పి. రాజారావు మాట్లాడుతూ, ఫారం పాండ్‌లో నీటిని నిల్వ చేసుకోవడంతో పాటు చేపల పెంపకానికి కూడా అనుకూలంగా ఉంటుందని, తద్వారా రైతులకు అదనపు ఆదాయం లభించే అవకాశం ఉంటుందని రైతులకు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పి. రాజారావు , వి బి జి రామ్, సిబ్బంది, గ్రామ సర్పంచ్ తేజావత్ వినోద్ కుమార్ మరియు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.ఫారం పాండ్ ప్రారంభోత్సవ కార్యక్రమం అనంతరం ఎంపీడీవో పి. రాజారావు పాల్వంచ మండలంలోని తొగూడెం, జగన్నాథపురం, కారెగట్టు సత్యనారాయణపురం, మందారికలపాడు, లక్ష్మీదేవిపల్లి-జ, ఉలవనూరు, రేగులగూడెం, చంద్రలగూడెం మరియు మల్లారం గ్రామపంచాయతీలలో పర్యటించారు.ఈ సందర్భంగా ఆయా గ్రామపంచాయతీలలో ఇందిరమ్మ ఇండ్ల ఎల్1, హాట్ హౌసెస్ ఇళ్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సంబంధిత వివరాలను వెరిఫికేషన్ చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచులు, కార్యదర్శులు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## పలు కేసుల్లో నిందితులకు కఠిన శిక్షలు

**కరీంనగర్ :** జిల్లాలో నేరాలకు పాల్పడిన నిందితులకు న్యాయస్థానాల ద్వారా కఠిన శిక్షలు పడేలా కరీంనగర్ పోలీస్ కోర్టు విభాగం విశేష కృషి చేసింది. ఈ ఏడాది ఇప్పటివరకు 17 కీలక కేసుల్లో నిందితులకు జైలు శిక్షలు, జరిమానాలు విధిస్తూ కోర్టులు తీర్పులు వెలువరించాయి. ఇందులో మూడు హత్య కేసుల్లో నిందితులకు యావజ్జీవ కారాగార శిక్షలు ఖరారయ్యాయి. . జిల్లా క్రైమ్ రివ్యూ సమావేశంలో నిందితులకు శిక్షలు పడేలా కృషి చేసిన కోర్టు డ్యూటీ అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, అదనపు పీపీలు, ఏపీపీలను పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు.

## ఆరోగ్యంపై అవగాహన

-మొదటిపేజీ తరువాయి

ప్రత్యేక శ్రద్ధ వహించాలని, అనారోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో వైద్యులను సంప్రదించాలని వైద్యులు సూచించారు.

**ప్రజలకు అందుబాటులో వైద్య సేవలు**

గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు వైద్య సేవలను మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం ఎంతో ఉపయోగకరంగా నిలిచింది. సాధారణంగా చిన్న ఆరోగ్య సమస్యలను కూడా నిర్లక్ష్యం చేసే వారు గ్రామంలోనే వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించుకునే అవకాశం లభించింది. వృద్ధులు, మహిళలు, యువతతో పాటు గ్రామంలోని పలువురు ప్రజలు శిబిరానికి వచ్చి వైద్యుల వద్ద తమ ఆరోగ్య సమస్యలను వివరించారు.

వైద్యులు ప్రతి ఒక్కరినీ పరీక్షించి వారి ఆరోగ్య పరిస్థితిపై అవగాహన కల్పించారు. అవసరమైన వారు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. ఆరోగ్య సమస్యలు ఎక్కువయ్యే వరకు వేచి చూడకుండా ముందుగానే వైద్యులను సంప్రదించడం ద్వారా అనేక సమస్యలను నియంత్రించవచ్చని సూచించారు.

**ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం**

ఈ సందర్భంగా పీఏసీఎస్ చైర్మన్ గూడెం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు. గ్రామ ప్రజలు తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన కార్యక్రమాలకు తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. గ్రామ పంచాయతీ సర్పంచ్ యాదగిరి గౌడ్ మాట్లాడుతూ గ్రామ ప్రజలందరూ ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవడం అభినందనీయమన్నారు. ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం, గ్రామం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ప్రజలు తమ ఆరోగ్యంపై అవగాహన పెంచుకుని, వైద్యులు సూచించిన జాగ్రత్తలను పాటించాలని కోరారు.

**గ్రామ ప్రజలకు అవగాహన**

వైద్య శిబిరంలో భాగంగా ప్రజలకు వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్యకరమైన ఆహారం, తగినంత నీరు తీసుకోవడం, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కాలానుగుణంగా వచ్చే అనారోగ్య సమస్యల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచించారు.

గ్రామంలోనే వైద్యులను అందుబాటులోకి తీసుకువచ్చి ఉచితంగా పరీక్షలు నిర్వహించడం వల్ల ప్రజలు తమ ఆరోగ్య సమస్యలను వైద్యులతో నేరుగా చర్చించుకునే అవకాశం పొందారు. వైద్యులు సూచించిన మేరకు అవసరమైన వారు తదుపరి వైద్య సేవలను పొందాలని తెలిపారు. ఉచిత వైద్య శిబిరం సందర్భంగా గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని వైద్యుల వద్ద పరీక్షలు చేయించుకున్నారు. ప్రతి ఒక్కరూ తమ వంతుగా ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిస్థితిని కూడా ఎప్పటికప్పుడు గమనించాలని నిర్వాహకులు సూచించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ గూడెం శ్రీనివాస్ రెడ్డి, గ్రామ పంచాయతీ సర్పంచ్ యాదగిరి గౌడ్, గ్రామ పంచాయతీ సెక్రటరీ సంగీత, వైద్యులు, వైద్య సిబ్బంది, గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, సిబ్బంది, గ్రామ పెద్దలు, మహిళలు, యువత, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## కీసరలో టిఫిన్ సెంటర్లో అగ్ని ప్రమాదం

**మేడ్చల్ :** కీసర గ్రామంలో టిఫిన్ సెంటర్లో సిలిండర్ లీకేజీతో ఒక్కసారిగా మంటలు చెల రేగాయి. ఉదయాన్నే టిఫిన్ తయారీ కోసమై సిలిండర్ వెలిగించడంతో ఒక్కసారిగా మం టలు ఎగసిపడ్డాయి అక్కడున్న వారు వెంటనే అప్రమత్తమై బయటకు పరుగులు తీ శారు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. . ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు.

## ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం...

**తుగ్గలి:** భారత ఎన్నికల సంఘం,జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కర్నూలు జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం నందు అభ్యంతరాల సవరణ కొరకు ప్రత్యేక క్యాంపెయిన్లను నిర్వహిస్తున్నట్లు తుగ్గలి తహసిల్దార్ రవి తెలియజేశారు.గురువారం రోజున విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 31.07.2026 నుండి 30.08.2026 వరకు క్లెయిములు మరియు అభ్యంతరాల స్వీకరణ జరుగుతుందని ఆయన తెలియజేశారు.ప్రజలకు మరింత చేరువలో సేవలు అందించేందుకు, ఓటరు జాబితా సవరణ ప్రక్రియను విస్తృతంగా నిర్వహించేందుకు ఆగస్టు నెల 22,23,29 మరియు 30 తేదీలలో కర్నూలు జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని ప్రతి పోలింగ్ కేంద్రంలో ఉదయం 10.00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహించబడుతుందని ఆయన తెలియజేశారు.ఈ కార్యక్రమం నందు సంబంధిత బూత్ లెవల్ అధికారులు ప్రతి పోలింగ్ కేంద్రంలో అందుబాటులో ఉండి ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరిస్తారని,ఫారం-6 అర్హత కలిగిన కొత్త ఓటర్ల నమోదు చేస్తారని, ఫారం-7 ద్వారా మరణించిన వారు, ఇతర ప్రదేశాలకు తరలి వెళ్లిన వారి పేర్ల తొలగింపు కార్యక్రమాన్ని నిర్వహిస్తారని,ఫారం-8 ద్వారా పేరు, వయస్సు,చిరునామా వంటి వివరాలలో దిద్దుబాట్లు నిర్వహిస్తారని,ఫారం-8ఏ ద్వారా ఒకే నియోజకవర్గంలోపు చిరునామా మార్పులను అధికారులు నిర్వహిస్తారని ఆయన తెలియజేశారు.కావున కర్నూలు జిల్లా ప్రజలు,రాజకీయ పార్టీల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఈ ప్రత్యేక క్యాంపెయిన్ తేదీలను సద్వినియోగం చేసుకొని అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా చేసుకోవాలని తుగ్గలి తహసిల్దార్ రవి తెలియజేశారు.

## దళితవాడ స్మశాన

## సమస్యను పరిష్కరించండి

**వారం రోజుల్లోపు పరిష్కరించకపోతే రోడ్లను దిగ్బంధిస్తాం**

**సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎండి ఆనంద్ బాబు.**

**తుగ్గలి:** తుగ్గలి మండల కేంద్రంలో ఉన్న దళితవాడ స్మశాన సమస్యను పరిష్కరించి, మండల వ్యాప్తంగా గుంతలు పడిన రోడ్లను వారంలోపు మరమ్మతులు చేయకపోతే రోడ్లను దిగ్బంధిస్తామని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు యం డి ఆనంద్ బాబు హెచ్చరించారు.గురువారం తుగ్గలి మండల కేంద్రంలోని రామాలయం కమ్యూనిటీ హాల్లో సిపిఎం మండల జనరల్ బాడీ సమావేశం సిపిఎం మండల నాయకులు రంగస్వామి అధ్యక్షతన నిర్వహించారు.అనంతరం సిపిఎం మండల కమిటి బృందం రాతన మరియు తుగ్గలి మండల కేంద్రంలో గుంతలు పడ్డ రోడ్లను, తుగ్గలి దళితవాడ స్మశాన స్థలాన్ని పరిశీలించి సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు యం.డి ఆనంద్ బాబు, మండల కార్యదర్శి శ్రీ రాములు, మండల నాయకులు రంగస్వామి మాట్లాడుతూ గ్రామాల మధ్యనే రోడ్లపై గుంతలు ఏర్పడి గ్రామ ప్రజలతో పాటు వాహనదారులు అనేక రకాల ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఏలిన వారికి మాత్రం ఏమాత్రం పట్టడం లేదని వారు విమర్శించారు.పత్తికొండ నుండి గుత్తికి వెళ్లే ప్రధానమైన రహదారిలో రాతన గ్రామంలో 20 మీటర్ల పరిధిలో గుంతపడి అనేకమంది ప్రమాదాల బారిన పడుతున్నా పట్టించుకోవడం లేదన్నారు.తుగ్గలి ప్రారంభంలోనూ, రైల్వే బ్రిడ్జి కింద గుంతల మయంగా ఉన్న గుర్తించడం లేదన్నారు,గత సంవత్సర కాలంగా రాతన తుగ్గలి ఎర్రగుడి జొన్నగిరి గ్రామాలలో రోడ్ల మరమ్మతులు నిర్వహించాలని ఆందోళనలు నిర్వహించి వినతి పత్రాలు ఇచ్చినా వినే వారే కరువయ్యారన్నారు.వారం రోజుల్లోపు ఈ రోడ్లు మరమ్మత్తులు చేయకపోతే రోడ్లను దిగ్బందించి నిరసన తెలియజేస్తామని హెచ్చరించారు. అలాగే తుగ్గలి మండల కేంద్రంలోని దళితవాడ స్మశాన వాటికకు వెళ్లాలంటే దళితపేట నుండి ఒకసారి వాగు దాటి బండి రస్తాలో వెళ్లి తిరిగి స్మశానం దగ్గరికి వెళ్లిన తర్వాత ఆ వాగును తిరిగి దాటాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు.వాగులు దాటేందుకు బ్రిడ్జిలు నిర్మించాలని ఎన్నిసార్లు మొత్తుకున్నా కనికరించకపోవడంతో దళితులే చందాలు వేసుకొని స్మశానం దగ్గర చిన్నపాటి బ్రిడ్జిని ఏర్పాటు చేసుకున్నారన్నారు.అయినా స్మశానంలోకి వాగు నీళ్లు వచ్చి గుట్టలు సైతం కొట్టుకుని పోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.దళితపేట వద్ద బ్రిడ్జి నిర్మించడంతోపాటు స్మశానంలో మట్టితోలి గుట్టలు,అందులోని శవాలు కొట్టుకొని పోకుండా చూడాలన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు గంగాధర్, ప్రసాద్,శికామణి,కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తహసీల్దార్ కార్యాలయ ఆకస్మిక తనిఖీ




**మంచిర్యాలరూరల్** మంచిర్యాల నియోజక వర్గంలోని హాజీపూర్ మండల తహసిల్దార్ కార్యాలయాన్ని అదన పు కలెక్టర్(రెవిన్యూ)వి. రాములు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న సాదా బైనామా,భూ భారతి దరఖాస్తులను రికార్డులను అనుసరించి వేగవంతంగా పరిష్కరించాలని పేర్కొన్నారు.ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా గుర్తించిన అనామలీస్ కు నోటీసుల జారీ,తదుపరి చర్యలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు.కార్యాలయంలో పెండింగ్ దరఖాస్తులు అన్నింటిని నిర్ణీత గడువులోగా పరిష్కరించి, సకాలంలో పూర్తి చేయాలని తెలిపారు.ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా భూసంబంధిత దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిశీలించి, సాధ్యమైనంత తొందరగా పరిష్కరించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ అతీష్,ఆర్ఐలు ప్రభు, మంగ తదితరులు పాల్గొన్నారు.

## బీసీ నేతలకు బుద్ధి రావాలి

**బీసీల న్యాయమైన డిమాండ్ల కోసం పోరాడాలి**

**బీసీ మహిళా రాష్ట్ర కన్వీనర్, అడ్వకేట్ పేరం అలేఖ్య**

**మంచిర్యాల :** తెలంగాణలో బీసీలకు సామాజిక న్యాయం, రాజకీయ ప్రాతినిధ్యం కోసం సాగుతున్న పోరాటాన్ని కొందరు బీసీ నేతలు తమ కుటుంబ స్వార్థ ప్రయోజనాలకు ఉపయోగించుకోవడం సిగ్గుచేటని బీసీ మహిళా రాష్ట్ర కన్వీనర్, అడ్వకేట్ పేరం అలేఖ్య విమర్శించారు. బీసీల సమస్యలను పక్కనపెట్టి వ్యక్తిగత, కుటుంబ వివాదాలను బీసీలపై దాడిగా చిత్రీకరిస్తూ సెంటిమెంట్‌తో చెలగాటం ఆడటం సరైంది కాదన్నారు. తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు, సమగ్ర కులగణన, స్థానిక సంస్థల్లో తగిన ప్రాతినిధ్యం వంటి అంశాలపై సామాన్య బీసీ బిడ్డలు ఎన్నో ఏళ్లుగా పోరాడుతున్నారని ఆమె పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ జీవో జారీ చేసిన విషయం తెలిసిందే. పదవులు అనుభవించిన కొందరు బీసీ నేతలు మాత్రం అసలు సమస్యలను పక్కనపెట్టి కుటుంబ వివాదాలను బీసీ సమస్యలుగా చిత్రీకరించడం ద్వారా సమాజాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని అలేఖ్య ఆరోపించారు. "ఇది బీసీ వాదం కాదు.. అవకాశవాదం" అని ఆమె తీవ్రంగా వ్యాఖ్యానించారు. బీసీల ఓట్లతో గెలిచి అధికారాన్ని, పదవులను అనుభవించిన వారు బీసీ హాస్టళ్ల అభివృద్ధి, బీసీ కార్పొరేషన్ల బలోపేతం, బీసీ విద్యార్థుల విద్యా, ఉపాధి అవకాశాల కోసం ఎంత మేరకు కృషి చేశారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బీసీల పేరు రాజకీయ ప్రయోజనాల కోసం మాత్రమే ఉపయోగించుకోవడం మానుకోవాలని సూచించారు. బీసీ వాదం అంటే ఒక కుటుంబానికి రక్షణ కవచం కాదని, రాష్ట్రంలోని వందలాది బీసీ కులాల ఆత్మగౌరవం, హక్కులు, భవిష్యత్తు కోసం నిలబడటమే నిజమైన బీసీ వాదమని ఆమె అన్నారు. కులగణన, రిజర్వేషన్లు, రాజకీయ ప్రాతినిధ్యం వంటి అంశాలపై బీసీ సమాజం ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని అన్నారు. ఇకనైనా బీసీ నేతలు వ్యక్తిగత ప్రయోజనాలను పక్కనపెట్టి బీసీల సమస్యలపై దృష్టి సారించాలని, బీసీల బాధను రాజకీయాలకు అమ్ముకోవడం మానుకుని వారి న్యాయమైన డిమాండ్ల సాధన కోసం నిజాయితీగా పోరాడాలని పేరం అలేఖ్య కోరారు.

## రాజీవ్‌గాంధీ ఆలోచనలు యువతకు మార్గదర్శకం

**కరీంనగర్** మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ ఆలోచనలు నేటి యువతకు మార్గదర్శకమని కాంగ్రెస్ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు అన్నారు. రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా రాజీవ్‌చౌక్‌లోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజేందర్‌రావు మాట్లాడుతూ.. 18 ఏళ్లకే యువతకు ఓటు హక్కు కల్పించి ప్రజాస్వామ్యంలో వారి భాగస్వామ్యాన్ని పెంచిన దార్శనికుడు రాజీవ్‌గాంధీ అని కొనియాడారు. ఆయన స్ఫూర్తితో 21 ఏళ్లు నిండిన యువతకు ఎంపీ, ఎమ్మెల్యేలుగా పోటీ చేసే అవకాశం కల్పించే దిశగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఆలోచిస్తోందన్నారు. సాంకేతికత, యువత, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతానికి రాజీవ్‌గాంధీ చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు మేడిపల్లి సత్యం, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, ఆకుల నరసన్న, వైద్యుల అంజన్‌కుమార్, కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, కౌన్సిలర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలు

**కూకట్పల్లి :** స్వర్గీయ మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ 82వ జయంతి వేడుకలను కె.పి.హెచ్.బి. 252 డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. డివిజన్ అధ్యక్షుడు దెంది అరవింద్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి బండి రమేష్, టీపీసీసీ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

# బొగ్గు గని మాజీ ఉద్యోగుల కనీస పెన్షన్ రూ.15 వేలకు పెంచాలి

**మెడికల్ కార్డు వైద్య పరిమితిని రూ.8 లక్షల నుంచి రూ.20 లక్షలకు పెంచాలి**

**సింగరేణి విశ్రాంత ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేయాలి**

**పాత మంచిర్యాలలో సింగరేణి విశ్రాంత ఉద్యోగులతో సన్నాహక సమావేశం**

**మంచిర్యాల :** బొగ్గు గని మాజీ ఉద్యోగుల కనీస పెన్షన్‌ను రూ.15 వేలకు పెంచాలని, మెడికల్ కార్డు (సిపిఆర్ ఎస్ఎస్ --ఎన్ఇ) వైద్య పరిమితిని ప్రస్తుత రూ.8 లక్షల నుంచి రూ.20 లక్షలకు పెంచాలని సింగరేణి విశ్రాంత ఉద్యోగులు డిమాండ్ చేశారు. మంచిర్యాల జిల్లా సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సెప్టెంబర్ ,9 న నిర్వహించనున్న ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని కోరుతూ పాత మంచిర్యాలలోని మైదానంలో గురువారం సింగరేణి విశ్రాంత ఉద్యోగులతో సన్నాహక సమావేశంను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విశ్రాంత ఉద్యోగులు తమ సమస్యలను సంఘం నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. పెన్షన్ పెంపుతో పాటు అర్హత కలిగిన విశ్రాంత ఉద్యోగులకు 2016 జూలై 1 నుంచి రావాల్సిన రూ.20 లక్షల గ్రాట్యుటీని ఇప్పించాలని కోరారు. విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారమే జిల్లా సంఘం ప్రధాన లక్ష్యమని నాయకులు తెలిపారు. ప్రతి సమస్యను ఐక్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, వివిధ జాతీయ సంఘాల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకునేందుకు కృషి చేస్తామని అన్నారు. విశ్రాంత ఉద్యోగులందరూ ఒకే చోట చేరి కుటుంబ సభ్యుల్లా ఆత్మీయంగా కలుసుకోవాలనే ఉద్దేశంతో మంచిర్యాల జిల్లాలో తొలిసారిగా సెప్టెంబర్ 9న ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమ్మేళనంలో చర్చించిన సమస్యలపై సమగ్ర ప్రతిపాదనలు రూపొందించి కేంద్ర బొగ్గు మంత్రికి, కోల్ ఇండియా యాజమా న్యానికి పంపేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. విశ్రాంత ఉద్యోగుల ఐక్యతే తమ బలమని, అందరూ కలిసికట్టుగా ముందుకు సాగితేనే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని నాయకులు అన్నారు. ఎవరో వచ్చి సమస్యలను పరిష్కరిస్తారని ఎదురుచూడ కుండా, స్వయంగా సమావేశాలు



నిర్వహించుకుని హక్కుల సాధన కోసం ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ ఆత్మీయ సమ్మేళనానికి ఇతర ప్రాంతాలకు చెందిన సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘాల నాయకులతో పాటు గోదావరిఖని సీఎంపీఎఫ్ కార్యాలయానికి చెందిన రీజినల్ కమిషనర్లను కూడా ఆహ్వానించినట్లు తెలిపారు. పాత మంచిర్యాల ప్రాంతంలోని విశ్రాంత ఉద్యోగులు సహకరించి తొలి సారి జరుగుతున్నా ఈ ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో మంచిర్యాల జిల్లా విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు రాళ్లబండి రాజన్న, జిల్లా అధ్యక్షులు గజెల్లి వెంకటయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి పూదరి నరసయ్య, జిల్లా ఉపాధ్యక్షులు అలవోయిన గంగయ్య, పానుగంటి .పోచన్న, పాత మంచిర్యాల విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు నాడం వెంకటి, ప్రధాన కార్యదర్శి పానుగంటి పోచయ్య, కోశాధికారి సంగం చంద్రమౌళి, ఉపాధ్యక్షులు పానుగంటి రాయలింగు, ఆర్గనైజింగ్ సెక్రటరీ బొలిశెట్టి చంద్రయ్య, సహాయ కార్యదర్శి ఎస్. అంకులు, జాబు రాజయ్య, కుదిరె లక్ష్మయ్య, బియ్యాల రాజయ్య తదితరులు పాల్గొన్నారు. ఆత్మీయ సమ్మేళనం విజయవంతం కావడానికి తమ వంతు సహకారం అందిస్తామని ఈ సందర్భంగా అక్కడి విశ్రాంత ఉద్యోగులు హామీ ఇచ్చారు.

# ఎస్ఐ పిసి ఉద్యోగాల ఉచిత శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల :** రామగుండం పోలీస్ కమిషనర్, మంచిర్యాల జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లాలోని నిరుద్యోగ అభ్యర్థులకు ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం అందిస్తున్న ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో డీసీపీ ఎ. భాస్కర్, మంచిర్యాల ఏసీపీ ప్రకాష్, బెల్లంపల్లి ఆర్ఐ సంపత్‌లతో కలిసి ఉచిత శిక్షణకు సంబంధించిన గోడ ప్రతులను కలెక్టర్ గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పోలీస్ శాఖలో ఉద్యోగాల కోసం సన్నద్ధమవుతున్న అర్హులైన అభ్యర్థులకు 90 రోజుల పాటు ఉచిత శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. శిక్షణలో భాగంగా అవసరమైన స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా అందించడంతో పాటు, ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలకు హైదరాబాద్‌కు చెందిన నిపుణులైన ఫ్యాకల్టీతో ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఎస్ఐ--పిసి ఎంపిక ప్రక్రియలో కీలకమైన ఈవెంట్స్‌కు సంబంధించి పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ అందిస్తామని తెలిపారు. అర్థమెటిక్, రీజనింగ్‌కు వరంగల్ లెజెండ్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన ఎం. రాధాకృష్ణ, కాకినాడ శ్యామ్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన యాకయ్య, కరీంనగర్ కేఎన్ఆర్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన గోపి, హైదరాబాద్ యూనిక్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన జి. రమేష్, బీఐపీ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన నాగరాజును ఫ్యాకల్టీగా నియమించినట్లు తెలిపారు. జనరల్ స్టడీస్, కరెంట్




అఫైర్స్‌కు ఆర్‌సీ రెడ్డి ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన సైదులు, తెలంగాణ హిస్టరీకి జయశంకర్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన రవీందర్, జియోగ్రఫీకి హైదరాబాద్ యూనిక్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన వెంకట్ రెడ్డి, పాలిటీకి హైదరాబాద్ శ్రీ షైన్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన శ్రీనివాస్, ఫిజిక్స్, కెమిస్ట్రీకి హైదరాబాద్ హెచ్ఐపీ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన రాజును ఫ్యాకల్టీగా నియమించినట్లు వివరించారు. ఆగస్టు 20 నుంచి జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో దరఖాస్తులు స్వీకరిస్తామని, ఆగస్టు 31న తరగతులు ప్రారంభమవు తాయని కలెక్టర్ తెలిపారు. అభ్యర్థులు 8712538278, 9490906773 నంబర్లకు ఫోన్ చేసి తమ వివరాలను నమోదు చేసుకోవచ్చని, వాట్సాప్ ద్వారా కూడా వివరాల నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు. అర్హత కలిగిన నిరుద్యోగ అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పోలీస్ ఉద్యోగాలు సాధించే దిశగా కృషి చేయాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కమాన్ పూర్ లో రాజీవ్ గాంధీ జయంతి

**కమాన్‌పూర్ :** కమాన్‌పూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. రాజీవ్‌గాంధీ దేశ అభివృద్ధికి, ఆధునిక సాంకేతిక రంగం అభివృద్ధికి విశేష కృషి చేశారని గుర్తు చేశారు. యువతకు ప్రాధాన్యతనిస్తూ దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. రాజీవ్‌గాంధీ ఆశయాలను కొనసాగిస్తూ ప్రజాసేవకు కాంగ్రెస్ శ్రేణులు అంకితమై పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లు రంగు సత్యనారాయణ గౌడ్, గుమ్మడి శ్రీనివాస్, బొంగోని సదయ్య,యువజన కాంగ్రెస్ అధ్యక్షులు రెబల్ రాజ్ కుమార మాజీ ఎంపీటీసీ లు శేవ్వా శంకరయ్య,పిల్లి చంద్ర శేఖర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పెన్ రెడ్డి కిషన్ రెడ్డి, మల్యాల మహేష్ గౌడ్, మహమ్మద్ యూసుఫ్ (లల్లు)ఉప సర్పంచ్ రాజమహేందర్, నగునూరి నర్సయ్య గౌడ్, చిగురు రవీందర్, ఇనగంటి శ్రావణ్ కుమార్ చాట్ల గట్టయ్య,మేడగొని విజయ్, చాట్ల రాయమల్లు, కాడిపల్లి సుమన్, కోలేటి సురేష్, కొంతం శ్రీనివాస్, పచ్చునురి రాజకుమార్, బోనాల పవన్, వెంగళి రాజయ్య,గర్రెపల్లి వెంకన్న, దాసరి రామస్వామి, మల్యాల చిన్న తిరుపతి, బత్తిని శ్రీనివాస్, బొంగుని వీరయ్య, బంగారి శ్రీనివాస్, ఆరెల్లి శ్రీనివాస్ లు తదితరులు పాల్గొన్నారు

## నేర నియంత్రణ, కేసుల దర్యాప్తులో వేగం పెంచాలి

**భూత్పూర్ సర్కిల్ కార్యాలయం వార్షిక తనిఖీ నిర్వహించిన జిల్లా ఎస్పీ డి.జానకి,**

**మహబూబ్ నగర్** పోలీస్ స్టేషన్ల పనితీరు, కేసుల దర్యాప్తు పురోగతి, నేర నియంత్రణ చర్యలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ప్రజలకు మరింత సమర్థవంతమైన పోలీస్ సేవలు అందించేందుకు అధికారులు కృషి చేయాలని జిల్లా ఎస్పీ డి.జానకి, సూచించారు. గురువారం భూత్పూర్ సర్కిల్ కార్యాలయాన్ని వార్షిక తనిఖీలో భాగంగాఎస్పీ పరిశీలించి, సర్కిల్ పరిధిలోని పోలీస్ స్టేషన్ల పనితీరు, నేరాల పరిస్థితి, కేసుల దర్యాప్తు తదితర అంశాలను సమీక్షించారు. ఇన్‌స్పెక్టర్ స్థాయిలో దర్యాప్తు చేస్తున్న కేసులను పెండింగ్‌లో ఉంచకుండా త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేసి, నాణ్యమైన ఆధారాలతో కేసులను కోర్టులో సమర్థవంతంగా నిరూపించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రతి కేసు దర్యాప్తు పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని తెలిపారు. సర్కిల్‌పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల హౌజ్‌లతో క్రమం తప్పకుండా నేర సమీక్ష సమావేశాలు నిర్వహిస్తూ, ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదవుతున్న నేరాలపై విశ్లేషణ చేయాలని సూచించారు. నేరాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టడంతో పాటు, పాత నేరస్తులు, రౌడీషీటర్లు మరియు అనుమానితుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్లకు వచ్చే ఫిర్యాదుదారుల సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని, బాధితుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ వారి ఫిర్యాదులపై సత్వరమే స్పందించాలని జిల్లా ఎస్పీ సూచించారు. ప్రజలకు పోలీసులపై నమ్మకం మరింత పెరిగేలా బాధ్యతాయుతమైన, ప్రజా అనుకూల పోలీసింగ్‌ను కొనసాగించాలని తెలిపారు.

# సంపాదకీయం

## మక్కా ఒప్పందం ముంచుతుందా...

పాకిస్తాన్ గత వారం సౌదీ అరేబియా, తుర్కియేలతో కలిసి ఒక కొత్త భద్రతా ఒప్పందంపై సంతకం చేసింది. ఈ ఒప్పందాన్ని 'మక్కా జాయింట్ డిఫెన్స్ అగ్రిమెంట్' అని పిలుస్తున్నారు. ఒప్పందం, మిడిల్ ఈస్ట్‌లో రూపుదిద్దుకుంటున్న కొత్త భద్రతా వ్యవస్థలో పాకిస్తాన్ స్థానాన్ని మరింత బలోపేతం చేస్తుందని భావిస్తున్నారు. అలాగే ఆ ప్రాంతంలో దాని వ్యూహాత్మక ప్రయోజనాలను ముందుకు తీసుకెళ్లడానికి సహాయపడుతుందని నిపుణులు చెబుతున్నారు.పాకిస్తాన్, సౌదీ అరేబియాల మధ్య ద్వైపాక్షిక రక్షణ ఒప్పందం కుదిరిన ఏడాదిలోపే ఈ మక్కా ఒప్పందం రూపుదిద్దుకుంది. భవిష్యత్తులో మరికొన్ని దేశాలు కూడా ఈ రక్షణ కూటమిలో చేరే అవకాశం ఉందని చెబుతున్నారు.ఇది కచ్చితంగా పాకిస్తాన్‌కు కలిసివచ్చే అంశమే. భారత్‌పై సాధించిన పెద్ద దౌత్య విజయంగా దీన్ని చూపించుకోవడానికి పాకిస్తాన్ శక్తివంచన లేకుండా ప్రయత్నిస్తుంది. అయినప్పటికీ, భారత్‌కు వ్యతిరేకంగా జరిగే ఏ ఉమ్మడి సైనిక చర్యలోనైనా పాల్గొనే ఉద్దేశం తుర్కియే, సౌదీ అరేబియాలకు ఉందని నేను అనుకోను. ఈ ఒప్పందంలో చేరడానికి ఆ రెండు దేశాలకు సొంత కారణాలు, వేర్వేరు ప్రయోజనాలు ఉన్నాయి" అని శ్యామ్ సరన్ అంటున్నారు."తుర్కియేతో పాకిస్తాన్ సంబంధాల కంటే, చైనాతో దాని సైనిక కూటమే భారత్‌కు అత్యంత ప్రమాదకరమైనదని నా ఉద్దేశం. దీనితో పాటు మనం ఆందోళన చెందాల్సిన మరో విషయం ఏంటంటే... అమెరికా మళ్లీ పాకిస్తాన్‌తో సన్నిహిత సైనిక సంబంధాలను ప్రారంభించడం. అమెరికా, చైనా రెండింటి మద్దతు మళ్లీ పాకిస్తాన్‌కు లభించడం అనేది మక్కా ఒప్పందం కంటే భారత్‌కు అత్యంత ఆందోళన కలిగించే అంశం" అని శ్యామ్ సరన్ విశ్లేషించారు.మక్కా ఒప్పందం వల్ల మధ్య ప్రాచ్యంలో ముస్లిం మెజారిటీ దేశమైన పాకిస్తాన్ ప్రభావం పెరుగుతుందని ఆగస్టు 12న ఫారిన్ పాలసీ అనే మ్యాగజీన్‌లో ప్రచురితమైన ఒక వ్యాసంలో థింక్ ట్యాంక్ 'అట్లాంటిక్ కౌన్సిల్' సౌత్ ఏషియా సీనియర్ ఫెలో మైకేల్ కుగెల్‌మన్ రాశారు."తమ దేశాన్ని ఒక బాధ్యతారాహిత్యమైన లేదా అస్థిరమైన భాగస్వామిగా కాకుండా, ప్రపంచస్థాయి శక్తిగా చూపించుకోవాలని పాకిస్తాన్ నాయకులు కోరుకుంటున్నారు. కాబట్టి ఇది వారికి చాలా ముఖ్యం. పైగా పాకిస్తాన్ వ్యూహాత్మక ప్రయోజనాలకు మిడిల్ ఈస్ట్ అత్యంత కీలకమైనది. అక్కడ దానికి ప్రధాన మిత్రదేశాలు ఉన్నాయి. పాకిస్తాన్ దిగుమతి చేసుకునే అధిక శాతం ఇంధనం అక్కడి నుంచే వస్తుంది. అలాగే లక్షల మంది పాకిస్తానీలు అక్కడ ఉపాధి పొందుతున్నారు" అని ఆ వ్యాసంలో కుగెల్‌మన్ పేర్కొన్నారు.అయితే, భారత్ పరంగా చూస్తే, ఈ ఒప్పందం వల్ల పాకిస్తాన్‌కు పెద్దగా ఒరిగేదేమీ ఉండదని ఆయన స్పష్టం చేశారు."సౌదీ అరేబియా, తుర్కియేలతో పాక్ కుదుర్చుకున్న ఈ ఒప్పందం పాకిస్తాన్‌కు తన సరిహద్దు భద్రతా విషయంలో ఉపయోగపడకపోవచ్చు. పాకిస్తాన్ భారత్‌తో గతంలోనూ, అలాగే నిరుడు జరిగిన ఘర్షణలతో సహా అనేక యుద్ధాలు చేసింది. ఇది కాకుండా, ఇప్పుడు అఫ్గానిస్తాన్‌లోని తాలిబాన్ ప్రభుత్వంతో కూడా తరచుగా సరిహద్దు ఘర్షణలు జరుగుతున్నాయి. కానీ అసలు నిజం ఏమిటంటే, పాకిస్తాన్ మిత్రదేశాలు దాని కోసం నేరుగా యుద్ధంలోకి దిగే అవకాశం లేదు" అని కుగెల్‌మన్ రాశారు.'ఒకవేళ పాకిస్తాన్‌పై భారత్ దాడి చేసినా.. భారత్‌కు వ్యతిరేకంగా సౌదీ అరేబియా ఆయుధాలు చేపడుతుందని అనుకోవడం అసంభవం. ఎందుకంటే, భారత్ కూడా సౌదీకి అత్యంత సన్నిహిత భాగస్వామి. తాలిబాన్ విషయంలోనూ దీని సంకేతాలు ఇప్పటికే కనిపిస్తున్నాయి.గత అక్టోబరులో అఫ్గానిస్తాన్ – పాకిస్తాన్ సరిహద్దుల్లో ఘర్షణలు చెలరేగాయి. సౌదీ అరేబియాతో ద్వైపాక్షిక రక్షణ ఒప్పందం కుదిరిన కొద్దికాలానికే ఈ ఘర్షణలు మొదలయ్యాయి. అయినప్పటికీ, సౌదీ అరేబియా ఆ ఒప్పందాన్ని అమలు చేస్తామని లేదా ఆ ఒప్పందం ప్రకారం ఈ ఘర్షణల్లో జోక్యం చేసుకుంటామని ఎప్పుడూ అనలేదు" అని మైకేల్ కుగెల్‌మన్ వివరించారు.ఇస్లాం పరంగా అత్యంత ప్రాముఖ్యత ఉన్న నగరంలో మూడు ప్రధాన ముస్లిం దేశాలు ఈ ఒప్పందం కుదుర్చుకున్నాయి. దాంతో ఈ కూటమి భవిష్యత్తులో ఇతర ముస్లిం దేశాలను కూడా తనతో కలుపుకుని ముందుకు వెళ్తుందనే ప్రచారం జరుగుతోంది.ఈ నేపథ్యంలో ఈ కూటమి 'ముస్లిం నేటో' రూపాన్ని సంతరించుకుంటుందా? అనే ప్రశ్న తలెత్తుతోంది. ఈజిప్ట్, ఖతర్, అజర్‌బైజాన్, జోర్డాన్, సిరియా దేశాలు భవిష్యత్తులో ఈ కూటమి విస్తరణలో చేరే అవకాశమున్న సహజమైన భాగస్వాములని 'మిడిల్ ఈస్ట్ కౌన్సిల్ ఆన్ గ్లోబల్ అఫైర్స్' సీనియర్ నాన్–రెసిడెంట్ ఫెలో అలీ బాకిర్ అన్నారు.నేటోలో రెండో అతిపెద్ద సైనిక శక్తి ఉన్న దేశం తుర్కియే. ప్రపంచంలోనే ఏకైక ముస్లిం అణుశక్తి దేశం పాకిస్తాన్. ఇక సౌదీ అరేబియా అనేది అపారమైన చమురు, ఆర్థిక బలం, పాశ్చాత్య ఆయుధాలు ఉన్న దేశం. ఈ మూడు శక్తులు ఒకే వేదికపైకి రావడం అంతర్జాతీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.ఒకవేళ ఏదైనా దాడి జరిగినప్పుడు ఈ కొత్త కూటమి ఎలాంటి ఉమ్మడి చర్యలు తీసుకుంటుందనే దానిపై ఇప్పటికీ ఒక స్పష్టత లేదని 'అట్లాంటిక్ కౌన్సిల్' నాన్–రెసిడెంట్ సీనియర్ ఫెలో డానీ సిట్రినోవిచ్ అన్నారు.'ఈ సైనిక కూటమిలోని దేశాలకు ఒక ఉమ్మడి శత్రువు లేనప్పుడు రక్షణ రంగంలో పరస్పర సహకారం మాత్రమే సాధ్యమవుతుందని, ఉమ్మడి రక్షణ కూటమి సాధ్యం కాదని అన్నారు."సాధారణంగా ఉమ్మడి రక్షణ అనేది అందరికీ ఉన్న ఒకే ఉమ్మడి శత్రువుకు వ్యతిరేకంగా ఉంటుంది. ఉమ్మడి శత్రువు లేనప్పుడు రక్షణ రంగంలో పరస్పర సహకారం మాత్రమే పెరుగుతుంది. పాకిస్తాన్, తుర్కియే, సౌదీ అరేబియా దేశాలకు వేర్వేరు శత్రువులు ఉన్నారు. అందువల్ల ఈ ఒప్పందం తర్వాత ఆయుధాల తయారీ, వనరుల వినియోగంలో సహకారం పెరగవచ్చు. కానీ ఇది 'ముస్లిం నేటో'గా మాత్రం మారదు.సౌదీ–తుర్కియే–పాకిస్తాన్ రక్షణ ఒప్పందం కేవలం ప్రచారానికే పరిమితం. ఆచరణలో అంతగా ఉపయోగపడదు. పరస్పర రక్షణ ఒప్పందానికి 'ఉమ్మడి శత్రువు' ఉండటమే ప్రాథమిక సూత్రం. కానీ ఇక్కడ అలాంటి శత్రువే లేరు" అని హక్కానీ స్పష్టం చేశారు.తుర్కియే సైనిక పరిశ్రమ వేగంగా విస్తరిస్తోంది. ముఖ్యంగా ఆధునిక డ్రోన్లను తయారు చేసే సామర్థ్యం దానికి ఉంది. కానీ, తన పొరుగున ఉన్న ఇజ్రాయెల్ సైనిక చర్యలపై అది ఆందోళన చెందుతోంది. ఈ మూడు దేశాల ఉమ్మడి భద్రతా ఒప్పందం ఉన్నంత మాత్రాన.. పాకిస్తాన్ వెళ్లి ఇరాన్ లేదా హూతీలపై యుద్ధం చేస్తుందని కానీ, లేదా భవిష్యత్తులో భారత్ – పాకిస్తాన్ యుద్ధం వస్తే తుర్కియే నేరుగా రంగంలోకి దిగుతుందని కానీ అనుకోకూడదు" అని ఆ కథనంలో స్టాన్లీ జోనీ రాశారు.

# వణుకు పుట్టిస్తున్న వైద్య ఖర్చులు

**ముంబై :** ఊహించని వైద్య ఖర్చులు తమకు ఒత్తిడిని కలిగిస్తున్నాయని 94 శాతం మంది భావిస్తున్నారని తాజా అధ్యయనంలో తేలింది. భారత్‌లో ఉద్యోగ భద్రత, ప్రపంచ అస్థిరత, ఇఓఎల కంటే కూడా పెరుగుతున్న మెడికల్ ఖర్చులే ఉద్యోగులను ఆందోళనకు గురిచేస్తున్నాయని టాటా ఏఐజీకి చెందిన 'ది కార్పొరేట్ హెల్త్ ప్రొటెక్షన్ పల్స్ 2026' అధ్యయనంలో వెల్లడైంది. ఉద్యోగం కోల్పోతే దాదాపు ప్రతి 10 మందిలో ఏడుగురు 6 నెలలు లేదా అంతకంటే తక్కువ కాలం మాత్రమే ఆర్థికంగా నెట్టుకురాగలరు.ప్రొటెక్షన్ గ్యాప్ ? పని చేసే సంస్థ ఇచ్చే బీమాతో పాటు అదనపు ఆరోగ్య బీమా ఉండటం ముఖ్యమని 84 శాతం మంది భావిస్తున్నారు, అయినప్పటికీ దాదాపు సగం మంది ఉద్యోగులు పనిచేసే సంస్థ అందించే గ్రూప్ మెడికల్ కవర్ (జీఎంసీ) కాకుండా వ్యక్తిగత ఆరోగ్య బీమాను కలిగి లేరు. అవగాహన లోపం, తర్వాత కొనుగోలు చేద్దాంలే అనే అలవాటు వ్యక్తిగత ఆరోగ్య బీమాను కొనుగోలు చేయడానికి ప్రధాన అడ్డంకులుగా నిలుస్తున్నాయి. భారత శ్రామిక శక్తిపై ఆరోగ్య సంరక్షణ మోపుతున్న పెరుగుతున్న ఆర్థిక భారాన్ని కూడా ఈ అధ్యయనం తెలిపింది. ఊహించని వైద్య ఖర్చులు తమకు ఆర్థిక ఒత్తిడిని కలిగిస్తున్నాయని ఇందులో పాల్గొన్న దాదాపు 94 శాతం మంది (రెస్పాండెంట్లు) తెలిపారు. ఉద్యోగం కోల్పోవడం లేదా కెరీర్ ఆగిపోవడం కంటే పెద్ద ఆందోళనగా మారింది. ఉద్యోగం లేకుండా ఒక ఏడాది కంటే ఎక్కువ రోజులు తాము ఆర్థికంగా నెట్టుకురాగలమని కేవలం 12% మంది మాత్రమే భావిస్తున్నారు. ఉద్యోగం కోల్పోయినప్పుడు దాదాపు ప్రతి 10 మందిలో ఏడుగురు కేవలం ఆరు నెలలు లేదా అంతకంటే తక్కువ కాలం మాత్రమే ఆర్థికంగా నిలదొక్కుకోగలమని చెప్పారు. దీర్ఘకాలం ఆదాయాన్ని కోల్పోవడాన్ని తట్టుకునేందుకు చాలా మంది కార్పొరేట్ ఉద్యోగులు సిద్ధంగా లేరని ఈ ఫలితాలు వెల్లడించాయి.కుటుంబానికి ఆరోగ్య బీమా, ఆసుపత్రి ఖర్చులు, జీవనశైలి వ్యాధులు, మానసిక ఆరోగ్యం, అత్యవసర పరిస్థితుల కోసం పొదుపు లేకపోవడం వంటివి కార్పొరేట్ భారత్‌లో ప్రధాన 5 ఆరోగ్య సంబంధిత ఆందోళనకర అంశాలుగా నిలిచాయి. ఉద్యోగం మారే సమయంలో ఆదాయం కోల్పోవడం, ఇఓఎలను మించి వైద్య ఖర్చులే అతిపెద్ద ఆర్థిక ఆందోళన అని ఈ అధ్యయనం స్పష్టం చేసింది. రెస్పాండెంట్లలో ఉద్యోగం మారే సమయంలో అంతరాయం లేని ఆరోగ్య బీమా కవరేజ్ ముఖ్యం అని 88 శాతం మంది భావిస్తున్నప్పటికీ, మెడికల్ కవరేజీ కొనసాగింపును అందించే సొల్యూషన్స్ కేవలం 40%



మందికే తెలుసు. అంటే ఉద్యోగ మార్పు ఈ కీలక దశలో బీమా గురించి అవగాహన పెంచాల్సిన అవసరం ఉంది. "కార్పొరేట్ ఉద్యోగులు పని చేసే సంస్థ అందించే ఆరోగ్య బీమాను ఎలా చూస్తున్నారనేది అర్థం చేసుకోవడం. సన్నద్ధతలో ఇప్పటికీ ఉన్న లోటుపాట్లను గుర్తించడం ఈ అధ్యయనం ఉద్దేశ్యం. ఉద్యోగుల శ్రేయస్సుకు గ్రూప్ మెడికల్ కవర్ ముఖ్యమే అయినప్పటికీ, వైద్య అత్యవసర పరిస్థితి లేదా ఉద్యోగ మార్పు సమయంలో తమ కవరేజ్ ఏ మేరకు ఉంటుందో.. అది సరిపోతుందో లేదో చాలా మందికి క్లారిటీ లేదు. వైద్య ఖర్చులు పెరుగుతున్న కొద్దీ, అవగాహన, ఆర్థిక సన్నద్ధత మరింత ముఖ్యం. ఈ విశ్లేషణలు, ఉద్యోగులు తమ ఆరోగ్య రక్షణ అవసరాలపై సమాచారంతో కూడిన నిర్ణయాలు తీసుకునేలా ప్రోత్సహిస్తాయి. ఆర్థికంగా నిలకడైన శ్రామిక శక్తిని నిర్మించడానికి యజమానులు, బీమా సంస్థలు, విధానకర్తల మధ్య మెరుగైన సహకారాన్ని పెంపొందిస్తాయని ఆశిస్తున్నట్లు" టాటా ఏఐజీ జనరల్ ఇన్సూరెన్స్ సంస్థ రీటైల్ – హెల్త్ అండర్‌రైటింగ్ హెడ్ డాక్టర్ సంతోష్ పురి తెలిపారు.ఉద్యోగం చేసే సంస్థ అందించే గ్రూప్ మెడికల్ కవర్ (జీఎంసీ)ని నిశితంగా పరిశీలిస్తే కొన్ని విషయాలు బయటపడతాయి. కంపెనీ అందించే జీఎంసీతో పాటు అదనపు ఆరోగ్య కవరేజ్ కలిగి ఉండాలని 84% మంది నమ్ముతున్నప్పటికీ, యజమాని అందించే కవర్ కాకుండా దాదాపు సగం మంది (45 శాతం) ఎలాంటి అదనపు హెల్త్ ఇన్సూరెన్స్ కలిగి లేరు. అదనపు ఆరోగ్య బీమాను కొనుగోలు చేయడానికి అవగాహన లోపం, తర్వాత పాలసీ తీసుకుందామనే వైఖరి ప్రధాన అడ్డంకిగా ఉన్నట్లు వెల్లడైంది. ముఖ్యంగా 28–34 సంవత్సరాల వయస్సు గలవారిలో ఇది ఎక్కువగా ఉంది.ఈ అధ్యయనం ద్వారా ఉద్యోగులు తమ గ్రూప్ మెడికల్ కవరేజ్ (జీఎంసీ) పట్ల సంతృప్తిగా ఉన్నప్పటికీ, ఆ కవరేజ్ ఎంతవరకు సరిపోతుందనే దానిపై వారికి నమ్మకం లేదు. అత్యవసర ఆసుపత్రి చేరిక సమయంలో యజమాని అందించే జీఎంసీ ఒక్కటే సరిపోదని దాదాపు 75 శాతం మంది అంగీకరించారు. కంపెనీ అందించే ఆరోగ్య బీమా పరిధి, పరిమితులపై ఉద్యోగుల అవగాహనలో లోపాలను ఈ సర్వే వెలుగులోకి తెచ్చింది. యజమాని అందించే జీఎంసీ అన్ని ఫీచర్లు, ప్రయోజనాల గురించి తమకు పూర్తిగా తెలుసునని కేవలం 41 శాతం మంది ఉద్యోగులు చెప్పారు. ముంబై, హైదరాబాద్, ఢిల్లీ, బెంగళూరు, చెన్నై, అహ్మదాబాద్, పుణే, కోల్‌కతా నగరాల్లో 28–55 సంవత్సరాల వయస్సు గల 748 మందికి పైగా కార్పొరేట్ ఉద్యోగులు ఈ సర్వేలో పాల్గొని తమ అభిప్రాయాలు షేర్ చేసుకున్నారు. అదనపు హెల్త్ ఇన్సూరెన్స్ కొనుగోలు చేయడానికి కుటుంబ రక్షణే బలమైన ప్రేరణగా నిలుస్తోంది. టాప్–అప్ ప్లాన్‌ను పరిశీలిస్తున్నప్పుడు తాము చూసే అత్యంత ముఖ్యమైన ఫీచర్లుగా ఎక్కువ బీమా మొత్తం, కుటుంబ సభ్యులకు కవరేజ్, ఉద్యోగం మారే సమయంలో కవరేజ్ కొనసాగింపు ఉండాలని కోరుకుంటున్నట్లు రెస్పాండెంట్లు పేర్కొన్నారు.

# గనులు.. రాష్ట్ర హక్కులు బలి

ఇటీవలే ముగిసిన వర్షాకాల సమావేశాల్లో విపక్షాల గలభా మధ్య కేంద్ర ప్రభుత్వం హడావుడిగా చుట్టబెట్టిన బిల్లుల్లో గనుల చట్టం సవరణకు సంబంధించిన బిల్లు కూడా ఉన్నది. ఈ సవరణను మామూలు సవరణగా చూడటానికి వీల్లేదు. అది రాష్ట్రాల హక్కులపై కేంద్రం పెత్తనం స్థిరపరచడానికి తీసుకువచ్చిందన్నది గమనించాల్సిన విషయం. ఖనిజాలపై పన్నులు, సెస్‌లు విధించాలంటే కేంద్రం నిర్దేశించిన పరిమితులకు లోబడి ఉండాల్సిందే అనే నిబంధన అందులో అత్యంత కీలకమైంది. ఇది కేవలం పరిపాలనా సంబంధమైన మార్పు కాదు. రాష్ట్రాల ఆర్థిక నిర్ణయాధికారంపై ప్రత్యక్ష దాడిగా చూడాల్సి ఉంటుంది. ఇప్పటివరకు ఖనిజ సంపద కలిగిన రాష్ట్రాలు తమ అవసరాలకు అనుగుణంగా ఆదాయ విధానాలు రూపొందించుకునే హక్కు కలిగి ఉండేవి. ఇప్పుడు సవరణ ద్వారా ఆ హక్కును కేంద్రం బలవంతంగా లాగేసుకున్నది. దేశ ఆర్థికాభివృద్ధికి ఖనిజ సంపద మూలం అనేది తెలిసిందే. అయితే ఆ సంపదపై ఎవరు నియంత్రణ కలిగి ఉండాలి? ఎవరు లబ్ధి పొందాలి? అనేది ప్రశ్న. కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల హక్కులను తగ్గిస్తున్నదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో 2026 గనుల చట్ట సవరణ వెనుకగల ఉద్దేశాలు సందేహాస్పదం అవుతున్నాయని చెప్పక తప్పదు. కేంద్రం దీనిని 'ఏకరీతి విధానం', 'పెట్టుబడులకు అనుకూల వాతావరణం' అనే అందమైన ముసుగులు వేసి సమర్థించుకోవడం ఏమాత్రం ఆశ్చర్యం కలిగించడం లేదు. కానీ దీని వెనుకనున్న అసలు ఉద్దేశం ఖనిజ రంగంలో పెద్ద కార్పొరేట్ సంస్థలకు పన్ను భారం తగ్గించడం అనేది స్పష్టమే. రాష్ట్రాలు ఎక్కువ పన్నులు విధిస్తే, కంపెనీలకు లాభాలు తగ్గుతాయి. ఇంతకూ ఈ చట్ట సవరణ అవసరం ఎందుకు వచ్చింది అనేది పరిశీలిస్తే 2024లో సుప్రీంకోర్టు తొమ్మిది మంది న్యాయమూర్తుల ధర్మాసనం ఇచ్చిన తీర్పు కారణమని తెలుస్తున్నది. రాష్ట్రాలకు గనుల భూమిపై, తవ్వకాలపై పన్నులు వేసే అధికారం ఉన్నదని ధర్మాసనం స్పష్టం చేసింది. ఆ తీర్పు అధిగమించేందుకు ఇప్పుడు కేంద్రం ఈ చట్ట సవరణ తెచ్చింది. రాష్ట్రాలకు పన్ను విధించే అధికారం లేకుండా చేసి, కార్పొరేట్ కంపెనీల లాభాలను రక్షించేందుకు



ఈ సవరణ తెచ్చారనేది నిర్వివాదాంశం. దేశంలోని అపార ఖనిజ సంపద కలిగిన ఒడిశా, జార్ఖండ్ తదితర రాష్ట్రాలు ఆ కారణంగానే ఈ సవరణను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. కేరళ ప్రభుత్వం ఏకంగా న్యాయపోరాటానికి సిద్ధమైనట్టు ప్రకటించింది. గనుల చట్టానికి తెచ్చిన తాజా సవరణ సహకార సమాఖ్య స్ఫూర్తికి పూర్తి విరుద్ధం. కేంద్రం మార్గనిర్దేశకుడిగా ఉండాలి గానీ, నియంత్రణాధికారం మొత్తం తన చేతుల్లోకి తీసుకోవడం సమాఖ్య వ్యవస్థను బలహీనపరుస్తున్నదని చెప్పక తప్పదు. దీనివల్ల ఖనిజ సంపదపై అధికంగా ఆధారపడే రాష్ట్రాలు ఆదాయపరంగా తీవ్రమైన నష్టాన్ని ఎదుర్కోవాల్సి వస్తుంది. నియంత్రణ కేంద్రం చేతుల్లోకి, లాభాలు కార్పొరేట్ కంపెనీల జేబుల్లోకి పోతాయి. కానీ పర్యావరణ నష్టాలు, భూసేకరణ సమస్యలు, స్థానిక ప్రజల ఉపాధి లోటు వంటి అన్నిరకాల సాధకబాధకాలను రాష్ట్రాలే భరించాలి. ఇదే అసలుసిసలు సమస్య. ఖనిజాలు తవ్వేది రాష్ట్రాల్లోనే కనుక ఆయా ప్రాంతాల ప్రజలే దాని భారం మోయాలి. కానీ ఆ సంపదపై నిర్ణయాధికారం కేంద్రం తన చేతుల్లోకి తీసుకుంటే అది 'సంపద స్థానికం–లాభం బయటి వారికి' అనే వలస పాలన తరహా నమూనాను ఆవిష్కరిస్తుంది. దీనిని అభివృద్ధి అనలేం. ఇది వనరుల పునర్విభజన పేరిట జరిగే దోపిడీ మాత్రమే. ఇంకా ఆందోళన కలిగించే విషయమేందంటే ఈ చట్టం వల్ల రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ పథకాలకు నిధులు సమకూర్చుకోవడం భారమైపోతుంది. ఖనిజ ఆదాయం తగ్గితే, విద్య, ఆరోగ్యం, మౌలిక వసతులపై ప్రభావం పడుతుంది. అంటే అంతమంగా కార్పొరేట్ లాభాల కోసం సాధారణ ప్రజల సంక్షేమం బలి అవుతున్నది. రాష్ట్రాల వనరులు రాష్ట్రాలే నియంత్రించాలి అనే సూత్రాన్ని కాపాడకపోతే, సమాఖ్య వ్యవస్థ కేవలం నామమాత్రంగా మిగిలిపోతుంది. రాష్ట్రాల హక్కులను కుదించే ప్రయత్నాలు చివరికి సమాఖ్య వ్యవస్థను బలహీనపరుస్తాయని చెప్పక తప్పదు.

## పిల్లల కోసం...

## ఆంధ్రను మించి తమిళనాడు

**చెన్నై :** ప్పటి వరకు ఇద్దరే ముద్దు అని ప్రకటనలు ఇచ్చిన ప్రభుత్వాలు ఇప్పుడు ఎక్కువ మంది పిల్లల్ని కనండి అని ప్రోత్సహిస్తున్నాయి. మూడో బిడ్డ పుడితే నగదు ప్రోత్సాహకాలు ఇస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ప్రకటించారు. ఇప్పుడు అదే బాటలో వెళ్తున్న తమిళనాడు సీఎం విజయ్ కీలక ప్రకటన చేశారు. తమిళనాడు విజయ ప్రభుత్వం, మూడో బిడ్డ పుట్టినప్పుడు ఇచ్చే ప్రసూతి సెలవును 12 వారాల నుంచి 365 రోజులకు అంటే ఒక ఏడాదికి పెంచింది. రాష్ట్రంలోని మహిళా ఉద్యోగులకు పెద్ద ఉపశమనం కల్పించింది. అసెంబ్లీలో శాఖాపరమైన డిమాండ్లపై జరిగిన చర్చ సందర్భంగా తమిళనాడు మంత్రి డి. శరత్‌కుమార్ ఈ ప్రకటన చేశారు. ఇప్పటివరకు మొదటి ఇద్దరు పిల్లలకు మాత్రమే 365 రోజుల సెలవు ఇచ్చేవారని, మూడో బిడ్డకు ఈ పరిమితి 12 వారాలుగా ఉండేదని, ఇప్పుడు రెండింటినీ సమానం చేశామని ఆయన తెలిపారు.తమిళనాడు అసెంబ్లీలో ఈ నిర్ణయాన్ని ప్రకటిస్తూ, ప్రభుత్వం సామాజిక సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తుందని ఒక మంత్రి తెలిపారు. త్వరలో అధికారిక ప్రభుత్వ ఉత్తర్వు జారీ అవుతాయి. ౫.ప్రస్తుత నిబంధనల ప్రకారం, ఇద్దరికంటే తక్కువ మంది పిల్లలు ఉన్న సాధారణ మహిళా ఉద్యోగులు మాత్రమే 365 రోజుల ప్రసూతి సెలవుకు అర్హులు. రాష్ట్ర ప్రభుత్వం గత కొన్నేళ్లుగా ప్రసూతి సెలవు కాలాన్ని క్రమంగా పెంచుతూ వచ్చింది. ప్రారంభంలో ఉన్న 90 రోజుల సెలవును 2011లో ఆరు నెలలకు, ఆ తర్వాత 2016లో తొమ్మిది నెలలకు, జూలై 2021లో పూర్తి 365 రోజులకు (ఒక సంవత్సరం) పెంచారు.సుప్రీంకోర్టు ఆదేశాలు,రాష్ట్ర ప్రభుత్వ సవరణల ప్రకారం, ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది పిల్లలున్న మహిళా ఉద్యోగులకు కేవలం 12 వారాల (84 రోజుల) పూర్తి వేతనంతో కూడిన ప్రసూతి సెలవు మాత్రమే లభించేది. ఇప్పుడు విజయ్ ప్రభుత్వం, మూడో బిడ్డకు కూడా వర్తించే విధంగా ఒక సంవత్సరం ప్రసూతి సెలవును ప్రకటించింది.ఆంధ్రప్రదేశ్ చాలా కాలం నుంచి అనురిస్తున్న జనాభా నియంత్రణ విధానాన్ని భిన్నంగా చంద్రబాబు గతంలోనే వరాలు ప్రకటించారు. జనాభా నియంత్రణ వల్ల భవిష్యత్‌లో దేశం అనేక సమస్యలను ఎదుర్కోబోతోందని అందుకే జనాభా అవసరమని చెప్పుకొస్తున్నారు. పిల్లలను భారంగా కాకుండా సంపదగా భావించాలని సూచించారు. అందుకే ఎక్కువ మంది పిల్లల్ని కనాలంటూ పిలుపునిచ్చారు. దీని కోసం ప్రభుత్వమే ఆర్థిక సాయం చేస్తుందని వెల్లడించారు. మూడో బిడ్డను కంటే 30వేలు నాల్గో బిడ్డను కంటే 40వేలు తల్లుల ఖాతాల్లో వేస్తామని ప్రకటించారు.

# బిజినెస్

## 1.62 లక్షల పైకి పుత్తడి



**న్యూఢిల్లీ, ఆగస్టు 20:** బంగారం మళ్లీ పుంజుకుంటున్నది. గురువారం ఒకేరోజు 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల గోల్డ్ ధర ఏకంగా రూ.4,300 ఎగబాకి మూడు నెలల గరిష్ఠ స్థాయి రూ.1.62 లక్షలు దాటింది. బులియన్ మార్కెట్ ముగిసే సమయానికి రూ.1,62,300 వద్ద ముగిసింది. డాలర్ బలహీనపడటంతో మదుపర్లు తమ పెట్టుబడులను సురక్షితమైన అతి విలువైన లోహాల వైపు మళ్లించడంతో వీటి ధరలు పుంజుకున్నాయని ఆల్ ఇండియా సరఫా అసోసియేషన్ వెల్లడించింది. అంతకుముందు ఇది రూ.1.58 లక్షలుగా ఉన్నది. మే 26న ముగిసిన రూ.1.62,400 తర్వాత ఇదే గరిష్ఠ స్థాయి కావడం విశేషం. బంగారంతోపాటు వెండి పరుగులు పెట్టింది. కిలో వెండి రూ.10 వేలు ఎగబాకి ఏడు వారాల గరిష్ఠ స్థాయి రూ.2.45 లక్షలకు చేరుకున్నది. అంతకుముందు ఇది రూ.2.35 లక్షలుగా ఉన్నది. డాలర్ బలహీనపడటం, ట్రెజరీ ఈల్డ్స్ తగ్గుముఖం పట్టడం వల్లనే అతివిలువైన లోహాల ధరలు మూడు నెలల గరిష్ఠ స్థాయిని తాకాయని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీ సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 66.31 డాలర్లు తగ్గి 4,456.72 డాలర్లకు పడిపోగా, వెండి 2 శాతం దిగి 65.82 డాలర్లకు దిగొచ్చింది.

## ఎస్బీఐ బీఎస్‌బీడీ ఖాతాదారులకు షాక్

### అక్టోబర్ 1 నుంచి నగదు ఉపసంహరణలపై చార్జీలు

**ముంబై :** ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్బీఐ.. బేసిక్ సేవింగ్స్ బ్యాంక్ డిపాజిట్ (బీఎస్‌బీడీ) ఖాతాదారుల నగదు ఉపసంహరణ చార్జీలను సవరించబోతున్నది. అక్టోబర్ 1 నుంచి అమల్లోకి రానున్న ఈ మార్పుల ప్రకారం.. ఖాతాదారులు మొత్తంగా నెలకు నాలుగు నగదు ఉపసంహరణలనే ఉచితంగా పొందగలరు. ఆపై ప్రతి నగదు ఉపసంహరణకూ రూ.15 చొప్పున (జీఎస్టీ అదనం) చెల్లించాల్సి ఉంటుంది. కాగా, బీఎస్‌బీడీ ఖాతాదారులు తమ ఖాతాల్లో ఎటువంటి కనీస నగదు నిల్వలను ఉంచనక్కర్లేదన్న విషయం తెలిసిందే. డిపాజిట్లు, ఉపసంహరణలు సహా కనీస బ్యాంకింగ్ సేవలను అందించడమే లక్ష్యంగా ఈ బీఎస్‌బీడీ ఖాతాలను బ్యాంకులు అందుబాటులో ఉంచుతున్నాయి. అలాగే రెగ్యులర్ సేవింగ్స్ అకౌంట్‌కు వీటికి సేవలు, లావాదేవీలు పరిమితుల్లో తేడాలుంటాయి.

# ఎఫ్‌పీఐల రివర్స్‌గేర్

### 17 ఏళ్ల కనిష్టానికి విదేశీ పెట్టుబడులు
### జూన్‌కల్లా 15.1 శాతానికి వాటా డౌన్
### ఎన్ఎస్ఈ మార్కెట్ పల్స్ నివేదిక

**ముంబై:** కొద్ది నెలలుగా విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐలు) దేశీ ఈక్విటీలలో అమ్మకాలకే అధిక ప్రాధాన్యమిస్తున్నారు. గత క్యాలండర్ ఏడాది(2025) బాటలో 2026లోనూ పెట్టుబడులను వెనక్కి తీసుకుంటున్నారు. దీంతో ఈ ఏడాది ఏప్రిల్--జూన్ త్రైమాసికానికల్లా ఎన్ఎస్ఈ లిస్టెడ్ కంపెనీలలో ఎఫ్‌పీఐల వాటా 15.1 శాతానికి క్షీణించింది. ఇది గత 17ఏళ్లలోనే కనిష్టంకాగా.. ఆగస్ట్ 2026 ఎన్ఎస్ఈ మార్కెట్ పల్స్ నివేదిక ఇంకా పలు అంశాలు వెల్లడించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2026--27) తొలి త్రైమాసికం(ఏప్రిల్--జూన్)లో ఎఫ్‌పీఐలు 15.1 బిలియన్ డాలర్ల(రూ. 1,43,150 కోట్లు) విలువైన అమ్మకాలు చేపట్టారు. వెరసి 2026లో జూన్ చివరికల్లా ఎఫ్‌పీఐలు దేశీ ఈక్విటీల నుంచి నికరంగా రూ. 2,30,752 కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. దేశీ ఫండ్స్ దన్ను..: ఎఫ్‌పీఐలకు విరుద్ధమైన బాటలో దేశీ మ్యూచువల్ ఫండ్స్ వాటా వరుసగా 12వ క్వార్టర్(ఏప్రిల్--జూన్)లోనూ మెరుగుపడింది. జూన్‌కల్లా 11.6%కి పుంజుకుంది. ఇది సరికొత్త రికార్డ్‌కాగా.. ఎన్ఎస్ఈ లిస్టెడ్ కంపెనీలలో దేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల(డీఐఐలు) వాటా 19.5%కి బలపడింది. ఫలితంగా దేశీ ఈక్విటీ మార్కెట్లో ఎఫ్‌పీఐలను మించుతూ డీఐఐలు వరుసగా ఏడో క్వార్టర్‌లోనూ అధిక వాటాను నిలుపుకున్నారు. ఇంతక్రితం 2003లో మాత్రమే ఎఫ్‌పీఐ వాటాను డీఐఐలు అధిగమించడం గమనార్హం!




# భారీ లాభాల్లో స్టాక్ మార్కెట్లు..
# సెన్సెక్స్ 628, నిఫ్టీ 154 పాయింట్లు వృద్ధి

ముంబై: స్టాక్ మార్కెట్లు వరుస నష్టాల నుంచి కోలుకున్నాయి. గురువారం బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 628.04 పాయింట్లు లేదా 0.82 శాతం పెరిగి 77,537.72 వద్ద నిలిచింది. ఒకానొక దశలో 701.43 పాయింట్లు పుంజుకున్నది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 153.55 పాయింట్లు లేదా 0.64 శాతం అందుకొని 24,231.85 వద్ద స్థిరపడింది. దీంతో గత 7 రోజుల నష్టాలకు తెరపడినట్లైంది. బాండ్ మార్కెట్ రాబడులకు కళ్లెం వేసేలా అమెరికా అడుగులు వేయడం.. ఈక్విటీ మార్కెట్ వైపునకు మదుపర్లను నడిపించిందని మెజారిటీ నిపుణులు తాజా మార్కెట్ ట్రెండ్‌ను విశ్లేషిస్తున్నారు. ఫారెక్స్ మార్కెట్‌లో డాలర్‌తో పోల్చితే రూపాయి విలువ నిలదొక్కుకుంటుండటం కూడా కలిసొచ్చిందని చెప్తున్నారు. కాగా, సెన్సెక్స్ షేర్లలో ఎటర్నల్, కొటక్ మహీంద్రా బ్యాంక్, ఐటీసీ, బజాజ్ ఫైనాన్స్, యాక్సిస్ బ్యాంక్, అల్ట్రాటెక్ సిమెంట్ షేర్లు మదుపర్లను విశేషంగా ఆకట్టుకున్నాయి. బీఎస్ఈ స్మాల్‌క్యాప్ కూడా 0.83 శాతం, మిడ్‌క్యాప్ 0.56 శాతం పెరిగాయి. రంగాలవారీగా.. రియల్టీ, ఎఫ్ఎంసీజీ, ఐటీ, ఆర్థిక సేవలు షేర్లు లాభపడ్డాయి. ఇక ఆసియా ప్రధాన మార్కెట్లలో దక్షిణ కొరియా, జపాన్, చైనా, హాంకాంగ్ సూచీలు లాభాల్లో ముగిశాయి.



# కొలంబో టెస్టుకు కొత్త అస్త్రం..
# 33 ఏళ్ల ఆల్‌రౌండర్ అరంగేట్రం..!

గాలే టెస్టులో భారీ విజయంతో ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్ ఆశల్నీ సజీవంగా ఉంచుకున్న భారత జట్టు.. సిరీస్‌పై కన్నేసింది. స్పిన్ అస్త్రంతో దెబ్బతీయానుకున్న శ్రీలంకను చిత్తుగా ఓడించిన టీమిండియా కొలంబోలోనూ చెలరేగాలని భావిస్తోంది. అరంగేట్రం మ్యాచ్‌లోనే మానవ్ సుతార్ 10 వికెట్లతో ఆకట్టుకోగా.. రెండో టెస్టులో ప్రయోగాలకు సిద్ధమవుతోంది భారత్. ఈసారి స్క్వాడ్‌లోని మరో ఆల్‌రౌండర్ డెబ్యూట్ క్యాప్ అందుకుంటాడని సమాచారం. శ్రీలంక పర్యటనను విజయంతో ఆరంభించిన భారత జట్టు రెండో టెస్టుకు పక్కాగా సిద్ధమవుతోంది. దేవ్‌దత్ పడిక్కల్ శతకమోత, ఆపై మానవ్ సుతార్ తిప్పేయడంతో అలవోకగా గెలుపొందిన టీమిండియా.. కొలంబోలో మరో స్పిన్ అస్త్రాన్ని ఉపయోగించనుంది. ఎడమ చేతివాటం స్పిన్నరైన 33 ఏళ్ల సరాన్ష్ జైన్(ఝుతీఖుఅంష్త్ర జీుఅఅ) ఈ మ్యాచ్‌తో టెస్టుల్లో అరంగేట్రం చేయనున్నాడనే వార్తలు వినిపిస్తున్నాయి. దేశవాళీలో మధ్యప్రదేశ్ తరఫున అద్భుతంగా రాణించిన జైన్ గాయపడిన వాషింగ్టన్ సుందర్ స్థానంలో స్క్వాడ్‌లోకి వచ్చాడు. ప్రతిభావంతుడైన అతడికీ అవకాశం ఇవ్వాలని మేనేజ్‌మెంట్ భావిస్తోంది. జైన్‌ను ఆడించాలనుకుంటే తుది జట్టు నుంచి కుల్దీప్ యాదవ్‌ను తప్పించాల్సి వస్తుంది. గాలే టెస్టులో ఈ చైనామన్ బౌలర్ 25 ఓవర్లలో 103 పరుగులిచ్చి ఒకటే వికెట్ తీశాడు. దాంతో.. కుల్దీప్‌ను పక్కనపెట్టడం దాదాపు ఖాయం అనిపిస్తోంది. ఆగస్టు 23 నుంచి రెండో టెస్టు జరుగనుంది.



## కొలంబో టెస్టుకు కీలక మార్పులు..
## ఆ ఇద్దరిని తీసుకున్న శ్రీలంక..!

స్వదేశంలో భారత జట్టు చేతిలో కంగుతిన్న శ్రీలంక సిరీస్ సమం చేయాలనే కసితో ఉంది. గాలే టెస్టు ఓటమి.. ఇద్దరు కీలక ఆటగాళ్లకు గాయాల నేపథ్యంలో కొలంబో టెస్టుకు కీలక మార్పులు చేసింది లంక. ఫీల్డింగ్ చేస్తూ గాయపడిన దినేశ్ చండీమాల్, కమిందు మెండిస్‌కు విశ్రాంతినిచ్చింది. గాలే టెస్టులో 165 పరుగుల ఓటమితో కొలంబోలో విజయమే లక్ష్యంగా పెట్టుకుంది శ్రీలంక. సిరీస్ సమం చేయాలంటే గెలవక తప్పని మ్యాచ్‌లో రెండు కీలక మార్పులు చేసింది ఆతిథ్య జట్టు. నాలుగో రోజు ఫీల్డింగ్ చేస్తూ గాయపడిన దినేశ్ చండీమాల్.. తొడ కండరాల గాయంతో ఇబ్బంది పడుతున్న కుశాల్ మెండిస్‌ను పక్కన పెట్టేసింది. కొలంబో టెస్టు కోసం వీరిద్దరి బదులు ఆల్‌రౌండర్ కమిల్ మిశ్రా, సహన్ అరాచ్చిగేలను స్క్వాడ్‌లోకి తీసుకుంది లంక. సొంతగడ్డపై నిర్వహించే లంక ప్రీమియర్ లీగ్‌లో మెరిసిన మిశార తుది జట్టులో ఉండే అవకాశముంది. అయితే.. ఓపెనర్ పథుమ్ నిశాంక కూడా ఈ మ్యాచ్‌కు డౌటే అనిపిస్తోంది. ఆగస్టు 23 నుంచి రెండో టెస్టు మొదలవ్వనుంది.



# స్పోర్ట్స్

## డ్రాతో ముందుకు
## రెండో రౌండ్‌లో భారత్

**అమ్స్టెల్వీన్:** ఎఫ్ఐహెచ్ మహిళల హాకీ ప్రపంచకప్‌లో భారత్‌రెండో రౌండ్‌లో అడుగుపెట్టింది. తమకంటే మెరుగైన ర్యాంకర్ ఇంగ్లండ్‌తో గురువారం జరిగిన పూల్-డీ ఆఖరి మ్యాచ్‌ను 0-0తో డ్రాగా ముగించింది. రెండో రౌండ్ వెళ్లేందుకు అవసరమైన పాయింట్ అందుకుంది. ఈ మ్యాచ్‌లో ఇంగ్లిష్ సాధించిన 11 పెనాల్టీ కార్నర్లను భారత గోల్‌కీపర్లు సవితా పునియా, బిచూ దేవి అద్భుతంగా తిప్పికొట్టారు. ముఖ్యంగా మ్యాచ్ ముగియడానికి మరో 30 సెకన్ల సమయం ఉందనగా బిచూచేసిన అద్భుత సేవ్‌తో భారత్ రెండో రౌండ్ బెర్తు సొంతం చేసుకుంది. అయితే ఈ మ్యాచ్‌లో లభించిన 6 పెనాల్టీ కార్నర్లను దీపిక, నవ్‌నీత్ కౌర్ గోల్స్‌గా మలచడంలో విఫలమయ్యారు. ఆట 4వ నిమిషంలో నవ్‌నీత్ కొట్టిన షాట్ ఇషికా స్టిక్‌ను తాకుతూ నెట్‌లోకి వెళ్లినప్పటికీ ఆ గోల్‌ను అంపైర్లు తిరస్కరించారు. తొలి రౌండ్‌లో ఓ విజయం, రెండు డ్రాలతో భారత్ రెండో స్థానంలో నిలవగా.. మరో పోరులో 5-1తో దక్షిణాఫ్రికాను ఓడించిన చైనా అగ్రస్థానం అందుకుంది.




## రిటైర్మెంట్ తర్వాత డోపీగా స్వప్న
## శివ్‌పాల్ సింగ్‌పై పదేండ్ల నిషేధం

న్యూఢిల్లీ: భారత స్టార్ అథ్లెట్, ఆసియా గేమ్స్ హెప్టాథ్లాన్ మాజీ విజేత స్వప్న బర్మన్ డోపింగ్ పరీక్షలో పట్టుబడింది. నిషేధిత స్టెరాయిడ్ బోల్డెనోన్ వాడినట్లు నిర్ధారణ కావడంతో జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా) ఆమెపై తాత్కాలిక సస్పెన్షన్ వేటు వేసింది. 2018 జకార్తా ఆసియా గ్రేమ్స్ హెప్టాథ్లాన్ విభాగంలో పసిడి పతకం నెగ్గిన స్వప్న బర్మన్ ఈ ఘనత సాధించిన భారత తొలి మహిళగా చరిత్ర సృష్టించింది. కాగా, వరుస గాయాల సమస్యల కారణంగా స్వప్న ఈ నెల ఆరంభంలోనే రిటైర్మెంట్ ప్రకటించింది. ఆట నుంచి తప్పుకున్నప్పటికీ డోప్ పరీక్షలో పట్టుబడటంతో నిబంధనల ప్రకారం ఆమె విచారణకు హాజరవ్వాల్సి ఉంటుందని నాడా స్పష్టం చేసింది. మరోవైపు రెండోసారి డోపీగా తేలిన మాజీ ఒలింపియన్, జావెలిన్ త్రోవర్ శివ్‌పాల్ సింగ్‌పై నాడా పదేండ్ల నిషేధం విధించింది.



## డబ్బుతో నన్ను ఎవరూ కొనలేరు: రాజ్‌పాల్ యాదవ్




ప్రముఖ బాలీవుడ్ హాస్యనటుడు రాజ్‌పాల్ యాదవ్ గత కొంతకాలంగా చెక్ బౌన్స్ కేసుల వివాదంలో చిక్కుకున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తనపై వస్తున్న విమర్శలు, ఆర్థిక ఇబ్బందులు మరియు న్యాయపరమైన వివాదాలపై ఆయన స్పందించారు. సినిమా పట్ల తనకు ఉన్న అనుబంధాన్ని, అంకితభావాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ డబ్బుతో కొలవలేమని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా డబ్బుతో నన్ను ఎవరూ కొనలేరంటూ తేల్చిచెప్పారు. 2013 నుంచి 2016 మధ్య కాలంలో తలెత్తిన సంక్షోభం వల్ల తాను కోట్లల్లో నష్టాన్ని చవిచూశానని ఆయన తెలిపారు. ఈ చట్టపరమైన చిక్కుల కారణంగా తన వృత్తిపరమైన ప్రయాణానికి తీవ్ర విఘాతం కలిగిందని, విదేశాల్లో జరగాల్సిన కనీసం 50కి పైగా పర్యటనలు, టూర్లను కోల్పోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా, అనివార్య పరిస్థితుల వల్ల తన పారితోషికాన్ని కూడా తగ్గించుకోవాల్సి వచ్చిందని పేర్కొన్నారు. డబ్బు కంటే కళే తనకు ముఖ్యమని చెబుతూ.. తాను కేవలం సినిమా విద్యార్థినని, నటనలో పరిపూర్ణత సాధించడమే తన లక్ష్యమని రాజ్‌పాల్ యాదవ్ అన్నారు. ఎన్ని కష్టాలు, సవాళ్లు ఎదురైనా ప్రేక్షకులు తనపై చూపిస్తున్న ఆదరాభిమానాలు ఎప్పటికీ మారలేదన్నారు. విమానాశ్రయాల్లో ప్రతిసారీ వందలాది మంది అభిమానులు వచ్చి తనతో సెల్ఫీలు దిగడమే ప్రజల నుంచి తనకు లభిస్తున్న నిజమైన ఆదరణకు నిదర్శనమని ఆయన తెలిపారు. గతంలో నటుడు రాజ్‌పాల్ యాదవ్ దర్శకత్వంలో తెరకెక్కిన 'అటా పటా లపట్టా' (ఘ్ఖ ్రఘ్ఖ ్ఖఝ్ఘ్ఖ) సినిమా ఆయన కెరీర్‌లో ఒక ముఖ్యమైన మైలురాయి. ఈ చిత్రం కోసం ఆయన పెద్దఎత్తున అప్పులు చేసి భారీ వ్యయంతో నిర్మాణ పనులు చేపట్టారు. అయితే బాక్సాఫీస్ వద్ద ఈ సినిమా ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోవడంతో ఆయన తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్నారు. ఈ నేపథ్యంలోనే తలెత్తిన లావాదేవీల వివాదాలు కోర్టుల వరకు వెళ్లాయి. ఈ విఫల ప్రయత్నం కారణంగా తలెత్తిన ఆర్థిక సమస్యలు చెక్ బౌన్స్ కేసులకు దారితీశాయి. దీనికి సంబంధించి పలు వేర్వేరు చెక్ బౌన్స్ కేసుల్లో ఢిల్లీ హైకోర్టు రాజ్‌పాల్ యాదవ్‌ను దోషిగా తేల్చింది. ప్రతి కేసుకు సంబంధించి ఫిర్యాదుదారునికి భారీ మొత్తంలో నష్టపరిహారం చెల్లించాలని న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది.

## ధర్మస్థల నియోజకవర్గం




సుమన్, సాయికుమార్, నటరాజ్, వరుణ్‌సందేశ్, వితికా షేరు ప్రధాన పాత్రధారులుగా రూపొందుతున్న చిత్రం 'ధర్మస్థల నియోజకవర్గం'. జై జ్ఞానప్రభ తోట దర్శకత్వంలో మేరుం భాస్కర్ నిర్మిస్తున్న ఈ పొలిటికల్ ఎంటర్‌టైనర్ సెప్టెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్నది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ప్రెస్‌మీట్‌ని నిర్వహించారు. నటీనటులంతా ఈ సినిమాలో భాగమైనందుకు ఆనందం వెలిబుచ్చారు. అన్ని వర్గాలకూ నచ్చే ఓ మంచి కథతో థియేటర్లలోకి రాబోతున్నామని దర్శకుడు జై జ్ఞానప్రభ తోట నమ్మకం వెలిబుచ్చారు. ఇంకా నిర్మాత మేరుం భాస్కర్, పీవీఆర్ సినిమాస్ ప్రతినిధి ఉదయ్ కూడా మాట్లాడారు. ఈ చిత్రానికి మాటలు: అస్లాం, కెమెరా: వెంకట హనుమ, సంగీతం: మహావీర్ ఎల్లంధర్.




## హైప్ పెంచేస్తున్న సుహాస్, సూరి 'మండాడి' పోస్టర్లు

టాలీవుడ్ యాక్టర్ సుహాస్ వన్ ఆఫ్ ది లీడ్ రోల్‌లో నటిస్తోన్న తమిళ చిత్రం మండాడి (మీఖఅఝఖఎఙ). సుహాస్ కోలీవుడ్ ఎంట్రీ ఇస్తున్న ఈ మూవీలో తమిళ నటుడు సూరి మరో లీడ్ రోల్‌లో నటిస్తున్నాడు. సెల్ఫీ ఫేం మతిమారన్ పుగళేంది డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీ సెప్టెంబర్ 10న తెలుగు, తమిళ భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ప్రమోషన్స్‌లో భాగంగా ఏదో ఒక అప్‌డేట్ అందిస్తూ ప్రేక్షకుల్లో క్యూరియాసిటీ పెంచేస్తున్నారు. ఇప్పటికే విడుదల చేసిన రషెస్ నెట్టింట హల్ చల్ చేస్తుండగా సుహాస్ బర్త్ డే స్పెషల్ ఒకటి ఆన్‌లైన్‌లో చక్కర్లు కొడుతూ సినిమాపై అంచనాలు పెంచేస్తుంది. మరోవైపు సెన్సార్ బోర్డు ఈ చిత్రానికి క్లీన్ యూ/ఏ 16ం సర్టిఫికెట్ జారీ చేసినట్టు తెలియజేస్తూ సూరి బోటు రైడ్ చేస్తూ అగ్రెసివ్‌గా ఉన్న లుక్‌ను షేర్ చేశారు. ఈ లుక్ మండాడిపై హైప్ పెంచేస్తోంది. తెలుగు రాష్ట్రాల్లో మండాడి థియాట్రికల్ రైట్స్‌ను పాపులర్ టాలీవుడ్ డిస్ట్రిబ్యూషన్ సంస్థ మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ దక్కించుకుంది. దీంతో మండాడి సినిమాపై అంచనాలు మరింత పెరిగిపోతున్నాయి. తీర ప్రాంతం, మత్స్యకారుల నేపథ్యంలో స్పోర్ట్స్ డ్రామాగా వస్తోన్న ఈ మూవీలో సుహాస్ సాట్టపులి రోల్‌లో కనిపించబోతున్నాడు. మహిమా నంబియార్ కీలక పాత్రలో నటిస్తుండగా.. సత్యరాజ్, రవీంద్ర విజయ్, అచ్యుత్ కుమార్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ మూవీకి జీవీ ప్రకాశ్ కుమార్ మ్యూజిక్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తుండగా.. ఆర్ఎస్ ఇన్ఫోటైన్‌మెంట్ తెరకెక్కిస్తోంది.




## శర్వానంద్ 'భోగి' సినిమా విడుదల వాయిదా.. అసలు కారణం ఇదే!

టాలీవుడ్ చార్మింగ్ స్టార్ శర్వానంద్ హీరోగా, మాస్ డైరెక్టర్ సంపత్ నంది దర్శకత్వంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న పీరియడ్ యాక్షన్ డ్రామా 'భోగి'. భారీ అంచనాల మధ్య రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రాన్ని వాస్తవానికి ఆగస్టు 28న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేయాలని మేకర్స్ గతంలో ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే, తాజాగా చిత్ర యూనిట్ నుంచి వెలువడిన సమాచారం ప్రకారం ఈ సినిమా అనుకున్న సమయానికి ప్రేక్షకుల ముందుకు రావడం లేదు. వీఎఫ్ఎక్స్ (ఎఖీశ) పనులకు మరింత సమయం పడుతుండటంతో ఈ సినిమా విడుదలను వాయిదా వేసినట్లు తెలుస్తుంది. సినిమాలోని విజువల్ స్కేల్, పీరియడ్ వరల్డ్ మరియు యాక్షన్ సీక్వెన్స్‌లను ఎక్కడా రాజీ పడకుండా అత్యుత్తమంగా తీర్చిదిద్దే ఉద్దేశంతోనే ఈ వాయిదా వేసినట్లు తెలిపారు. వీఎఫ్ఎక్స్ పనులు పూర్తిగా పూర్తయిన తర్వాత కొత్త రిలీజ్ డేట్‌ను త్వరలోనే ప్రకటించనున్నట్లు స్పష్టం చేశారు. 1960ల నాటి ఉత్తర తెలంగాణ--మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతం నేపథ్యంలో ఈ బలమైన కథ సాగనుండగా, ఇందులో శర్వానంద్ 'గంగా' అనే అత్యంత ఇంటెన్స్ పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రంలో ఆయన సరసన అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయాతి కథానాయికలుగా నటిస్తున్నారు. ఈ సినిమా క్లైమాక్స్ కోసం చిత్రబృందం ఏకంగా 30 రోజుల పాటు సాగిన భారీ యాక్షన్ షెడ్యూల్‌ను ఇటీవల విజయవంతంగా పూర్తి చేసింది. శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కె.కె.రాధామోహన్ అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రానికి టాలెంటెడ్ మ్యూజిక్ డైరెక్టర్ భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. తెలుగుతో పాటు హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రం విడుదల కానుంది.



Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s SAI KRISHNA PUBLICATIONS, Owned by M/s SAI KRISHNA PUBLICATIONS, Printed at – Sree Seshasai Enterprises, Plot No.98/1, Co-operative Industrial Estate, IDA Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri District, Telangana. Published at H.No.3-5-182, Kotagally, Ushaprasad Multiplex back side, Nizambad District-503001, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2010/35558 Phone No. 9440231967